Title Code:T/TG/2024/0625/0392/884

వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 12

గురువారం, 27 ఫిబ్రవరి, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

ఏపీ నీటి తరలింపును అడ్డుకోండి

- శ్రీశైలం నుంచి చుక్క నీరూ ఇవ్వొద్దు
- సాగర్ కుడి కాల్వకు నీటిని 7 వేల నుంచి 5 వేల క్యూసెక్కులకు తగ్గించండి
- కృష్ణా బోర్డు ఎదుట తెలంగాణ వాదన
- అత్యవసర భేటీకి మరోసారి ఏపీ డుమ్మా
- తెలంగాణకు 63, ఏపీకి 55 టీఎంసీలు
- రబీ సాగు ప్రణాళిక సిద్ధం చేసిన సీఈలు
- నీటి కేటాయింపులపై నేడు బోర్డు నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 26: "శ్రీశైలం జలాశయం నుంచి ఇప్పటి దాకా 240 టీఎంసీల నీటిని ఏపీ తరలించింది. ఇక ముందు చుక్క నీటిని తరలించకుండా ఏపీని అడ్డుకోవాలి. నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాల్వ ద్వారా ఆ రాష్ట్రం తీసుకుంటున్న 7వేల క్యూసెక్కులను తక్షణమే 5వేల క్యూసెక్కులకు తగ్గించేలా నిర్ణయం తీసుకోవాలి" అని తెలంగాణ డిమాండ్ చేసింది. ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, సాగర్‌లో మిగిలి ఉన్న నీటి నిల్వలను ఏపీ, తెలంగాణకు పంపిణీ చేసే అంశంపై బుధవారం జలసౌధలో కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబి) రెండో అత్యవసర - 2వ పేజీలో

చేయూతనివ్వండి

- హైదరాబాద్ మెట్రో ఫేజ్2కు అనుమతివ్వాలి
- ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి
- మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్‌కు నిధులు కావాలి
- రీజినల్ రింగ్ రైల్.. డ్రైపోర్ట్‌లు మంజూరు చేయండి
- సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతించండి
- ఐదు ప్రధాన అంశాలపై ప్రధాని నరేంద్రమోదీకి సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఘటనపై ప్రధానికి వివరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 26: తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే వివిధ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. అయిదు ప్రధాన అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ప్రధానికి అందించారు. ప్రధాని మోదీని బుధవారం ఢిల్లీలో ఆయన అధికారిక నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పలువురు ఉన్నతాధికారులు కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలతో పాటు విభజన చట్టంలోని పలు అంశాలను కూడా ప్రధాని దృష్టికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకెళ్లారు. హైదరాబాద్ మహానగరంలోని అన్ని ప్రాంతాలకు మెట్రో రైలు సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చేపడుతున్న ఫేజ్-అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని సీఎం, ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో ఫేజ్2 కింద రూ.24,269 కోట్ల అంచనాతో 76.4 కిలోమీ టర్ల పొడవైన 5 కారిడార్లను ప్రతిపాదించామని, ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతించాలని అభ్యర్థించారు. రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూసేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానమంత్రి మోదీని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఉత్తర భాగం తో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానం సులభతరమవుతుందని వివరించారు. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని, సముద్ర తీరరేఖలేని తెలంగాణకు వస్తువుల - మిగతా 2వ పేజీలో

మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డే అడ్డు

- బాధ్యత.. కిషన్‌రెడ్డి, బండిపైనే ఉంది
- ఆ ప్రాజెక్టులకు నిధులు తీసుకొస్తే.. భారీ బహిరంగ సభ పెట్టి గండపెండేరం తొడుగుతా
- సీబీఐ కేసుల పేరుతో బీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవాలని బీజేపీ చూస్తోంది
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్

ప్రపంచ ఫార్మసీ నగరం

- దేశీయ ఫార్మా ఆదాయంలో 35 వాటా హైదరాబాద్‌కే
- బల్క్‌డ్రగ్, వ్యాక్సిన్ క్యాపిటల్ భాగ్యనగరం
- 'బయో ఏషియా-2025' ముగింపు కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- 'బయో ఏషియా' చరిత్రలో ఈ సదస్సు మైలురాయి: రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 26: భారత ఫార్మారంగంలో తెలంగాణ కీలకపాత్ర పోషిస్తోందని, బల్క్‌డ్రగ్ క్యాపిటల్‌గా, వ్యాక్సిన్ హబ్‌గా ఐటీ ఎగుమతుల్లో లీడర్‌గా హైదరాబాద్ ఖ్యాతి గడించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ ముత్యాల నగరం మాత్రమే కాదని, ప్రపంచ ఫార్మసీ నగరంగా, అంతర్జాతీయ స్థాయి ఆస్పత్రుల హబ్‌గా మారిందన్నా రు. అందరం కలిసి హెల్త్‌కేర్ రంగాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుదామని ఆయా దేశాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని హెచ్ఐఐసీలో 'బయో ఏషియా-2025' ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బయో ఏషియా స్టాల్స్‌లో ప్రదర్శించిన టాప్-5 స్టార్టప్‌లకు అవార్డులు అందజేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 800 ఫార్మా, బయో టెక్, మెడిటెక్ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా చేస్తున్నాయన్నారు. ఐఐటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ (నైపర్), సీసీఎంబీ, ఐఎస్‌బీ, నల్సార్, డీఆర్‌డీవో వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి ప్రతిభావంతులు ఆయా - మిగతా 2వ పేజీలో

కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

హైదరాబాద్: తెలంగాణ శాసనమండలికి మూడు నియోజకవర్గాల నుంచి జరిగే ఎన్నికలకు గురువారం పోలింగ్ ప్రారంభమై, కొనసాగుతోంది. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయ నియోజకవర్గాలు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం అనే మూడు స్థానాలు ఉన్నాయి. ప్రాధాన్యతా పద్ధతిలో ఓటింగ్ జరుగుతున్న ఈ బ్యాలెట్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుంది. ఎన్నికల కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఒక్క గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి 56 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాలకు వరుసగా 15 మంది, 19 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. బీజేపీ మూడు స్థానాలకు పోటీ చేస్తుండగా, అధికార కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ల నియోజకవర్గానికి మాత్రమే అభ్యర్థులను నిలబెట్టింది. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంది. కేంద్ర మంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఇతర బీజేపీ నాయకులు ఎన్నికల కోసం విస్తృతంగా ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఇతర సీనియర్ పార్టీ నాయకులు పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేశారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువత సమస్యలపై బిజెపి పోరాడిందని, పార్టీ అభ్యర్థులు ఎన్నికైతే, ఉపాధ్యాయులతో పాటు గ్రాడ్యుయేట్లు, ఇతర విద్యావంతులైన వర్గాల సమస్యలపై గళం విప్పుతారని పార్టీ తెలిపింది. మార్చి 3న ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లు లెక్కించబడతాయి.

2 నెలలు.. 2.69 లక్షల ట్యాంకర్లు

- గతేడాది ఇదే సమయానికి 1.94 లక్షల వాటర్ ట్యాంకర్ల డెలివరీ
- మార్చి, ఏప్రిల్‌లో మరింత పెరిగే ఛాన్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 26: వేసవి ఆరంభంలోనే జలమండలి పరిధిలో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది. గతేడాది జనవరి, ఫిబ్రవరిలో కలిపి 1,94, 747 వాటర్ ట్యాంకర్లను బుక్ చేయగా.. ఈ ఏడాది జనవరిలో 1,19,752, ఫిబ్రవరిలో ఇప్పటికే దాదాపు 1.50 లక్షల ట్యాంకర్లను డెలివరీ చేసినట్లు జలమండలి అధికారిక లెక్కలు చెబుతున్నా యి. నగరంలోని చాలా చోట్ల భూగర్భజలా లు పడిపోవడం, నివాసాల్లోని బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్ల బుకింగ్స్ పెరుగుతు న్నాయి. డెలివరీలు కూడా అదే స్థాయిలో పెరుగుతుండటం గమనార్హం. జలమండలి డెలివరీ చేస్తున్న వాటర్ ట్యాంకర్ల గణాంకాలను పరిశీలిస్తే గతేడాది కంటే ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 40శాతం పెరిగింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ట్యాంకర్లకు మరింత ఎక్కువ డిమాండ్ వచ్చే పరిస్థితులున్నాయి.

ఏటా పెరుగుతున్న డిమాండ్: నగరంలో ఏటా వాటర్ ట్యాం కర్లకు డిమాండ్ పెరుగుతోంది. 2022లో 32శాతం, 2023 లో 19శాతం, 2024లో 31శాతం, ఉండగా ఈ ఏడాది ఫిబ్ర వరి నాటికే 37 శాతం డిమాండ్ పెరిగింది. వినియోగదారు ల నుంచి వస్తున్న డిమాండ్‌కు తగ్గట్లుగా ట్యాంకర్‌ను బుక్ చేసిన 24 గంటల్లోనే డెలివరీ చేస్తున్నారు. వాటర్ ట్యాంకర్లకు కొన్ని ప్రాంతాల్లోనే ఎక్కువగా డిమాండ్ ఉండటం గమనార్హం. జలమండలి పరిధిలోని మణికొండ, దుర్గంచెరువు, కూకట్‌పల్లి, ఎస్ఆర్‌నగర్, నిజాంపేట్, హీఫీజ్‌పేట్, ఆసిఫ్‌నగర్, అల్వాల్, రాజేంద్రనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌళి, మాదా పూర్, అమీర్ పేట్, తదితర ప్రాంతాల్లో ఎక్కువగా బుకిం గ్స్, డెలివరీలు జరుగుతున్నాయి. కాగా జలమండలి సరఫరా చేసే

వాటర్ ట్యాంకర్ల కోసం 24 గంటలు వేచి ఉండాలా అనే ఉద్దేశంతో కొన్ని ప్రాంతాల్లో పలువురు వినియో గదారులు, కమర్షియల్ కాంప్లెక్స్, అపార్ట్‌మెంట్‌ల నిర్వాహకులు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటున్నారు.

జలమండలి ముందస్తు చర్యలు

వాటర్ ట్యాంకర్ల బుకింగ్స్ పెరుగుతున్నందున జలమండలి అధికారులు ముం దస్తు చర్యలు చేపడుతున్నారు. జలమండలి పరిధిలో గతేడాదిలో 69 ఫిల్లింగ్ స్టేషన్లు, 93 ఫిల్లింగ్ పాయింట్లు, 577 వాటర్ ట్యాంకర్లు ఉండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 79 ఫిల్లింగ్ స్టేషన్లు, 123 ఫిల్లింగ్ పాయింట్లు, 907 వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు. ఫిల్లింగ్ పాయింట్ల వద్ద ఒక్కో వాటర్ ట్యాంకర్ నిండేందుకు దాదాపు 8- నిమిషాల సమయం పడుతున్నట్లు గుర్తించి, ఫిల్లింగ్ సమయాన్ని 5 నిమిషాలకు తగ్గించారు. తద్వారా ఎక్కువ ట్రిప్పులను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

కానరాని జాడ

- రెండు రోజుల్లో కార్మికులను కాపాడుతాం: మంత్రి ఉత్తమ్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 26: ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంలో ఎనిమిది మంది కార్మికులు గల్లంతై సుమా రు ఐదు రోజులు కావస్తున్నా వారి జాడ లభించకపోవడంతో వారి కుటుంబ సభ్యు లు తల్లడిల్లుతున్నారు. మంగళవారం రాత్రి ర్యాట్ హోల్ మైన్స్ రెస్క్యూ బృందం ఘట నాస్థలికి వెళ్లిన నేపథ్యంలో రెస్క్యూ టీం కార్మికులకు సైతం ఘటనాస్థలి ప్రాంతంలో కార్బన్ మోనాక్సైడ్ తీవ్రత వల్ల ఆక్సిజన్ అందక సరిగ్గా 20 నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో క్షతగాత్రులైన కార్మికులు ఊపిరితో ఉండ టం కష్టతరమేనని ర్యాట్‌హోల్ మైనింగ్ రెస్క్యూటీమ్, ఎన్డీఆర్ఎఫ్ టీం సభ్యులు చెపుతున్నారు. బుధవారం సాయం త్రం మరో మారు 11 రకాల రెస్క్యూ బృందాలు సొరంగ మార్గానికి వెళ్లి గ్యాస్ కట్టర్ ద్వారా టీబీఎం మిషన్ తొలగించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు దీంతోపాటు కన్వేయర్ బెల్ట్ రిపేర్ చేసేందుకు ప్రతినిధులు సొరంగ మార్గానికి వెళ్లారు. ప్రమాదం జరిగిన దగ్గర టీబీఎం ముక్కలై, దాని విడిభాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో అక్కడ సహాయ చర్యలు కష్టంగా మారాయి. ఓవైపు బురద, ఇంకోవైపు సీపేజ్ వాటర్, మరోవైపు టీబీఎం ముక్కలతో అత్యంత ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్యాస్ కట్టర్లను ఉపయోగించి ప్రక్రియను నిర్వహించాలనుకుంటే, ఉబికి వస్తున్న నీరు అడ్డంకిగా మారింది.

సురక్షితంగా బయటకు తెస్తాం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సొరంగంలోని 14వ కిలోమీటర్ వద్ద జరిగిన ప్రమాదంలో మొదటి నుంచి నీటి ఊటతోపాటు భారీ బండరాళ్లు, బురద సహాయక చర్యలు ఇబ్బందులు - మిగతా 2వ పేజీలో

ప్రపంచ ఫార్మసీ నగరం

(మొదటి పేజీ తరువాయి)

రంగాల్లో సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, ఫార్మాసిటీ, మెడికల్ డివైజెస్ పార్కు వం టివి విదేశీ పెట్టుబడులను ఆకర్షించి, 2047 నాటికి 500 బిలియన్ డాలర్ల లైఫ్ సెన్సెస్ ఎకానమీ సృష్టి దిశగా అడుగులు వేసే అవకాశాలు హైదరాబాద్‌లో మెండుగా ఉన్నాయని చెప్పారు. ప్రపంచ అవసరాల్లో 60 శాతానికి పైగా వ్యాక్సిన్లు, 20శాతం జెనరిక్ మందులను భారత్ నుంచే సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2014లో 15 బిలియన్ డాలర్లు ఉంటే, 2024 నాటికి 27.85 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు స్పష్టం చేశారు. కేంద్రం సహకారం తోనే ఈ అనూహ్య మార్పు జరిగినట్లు పేర్కొన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రం ఆర్థిక సంస్కరణల వల్ల దేశం త్వరలోనే మూడో స్థానానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రూ.1.2లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు

2024లో హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ కంపెనీల ద్వారా రూ.1.2లక్షల కోట్ల ఐటీ సేవలు ఎగుమతులు జరిగినట్లు కిషన్ రెడ్డి వివరించారు. కేంద్ర తీసుకొచ్చిన 'మెడ్‌టెక్ మిత్ర' వంటి వేదికలు ఆవిష్కర్తలకు, స్టార్టప్స్, భా గస్వామ్యపక్షాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు దోహదపడుతు న్నాయన్నారు.

మానవ వనరులకు హబ్ తెలంగాణ: శ్రీధర్‌బాబు

తెలంగాణను మానవ వనరులకు హబ్ గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌పై తాము దృష్టి పెట్టామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మం త్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. బయో ఏషియా సదస్సుకు ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వచ్చినట్లు చెప్పారు. బయో ఏషియా చరిత్రలో ఈ ఏడాది సదస్సు ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. దేశ, విదేశాల నుంచి 4వేల మంది ఫార్మా,హెల్త్ కేర్ ఇండస్ట్రీ లీడర్స్, పాలసీ మేకర్స్, ఆవిష్కర్తలు హాజరైనట్లు చెప్పారు. 200కు పైగా బీటూబీ(బిజినెస్ టూ బిజినెస్) మీటింగ్స్ జరిగాయని, గతేడాది కంటే ఈసారి ఎక్కువ పెట్టుబడులు వచ్చినట్లు వివరించారు. అమెరికాకు చెందిన బయోటెక్నాలజీ దిగ్గజ సంస్థ 'ఆమ్జెన్' భారీ గా పెట్టుబడి పెట్టిన సంస్థల్లో ఒకటని, దీనివల్ల మూడు వేల మందికి ఉపాధి దక్కుతుం దన్నారు. మొత్తం 84 స్టార్టప్స్ ఈ ఏడాది సదస్సులో పాల్గొన్నాయని వెల్లడించారు.

లగచర్లలో పర్యావరణహిత పరిశ్రమల ఏర్పాటు

లగచర్లలో ఫార్మా పరిశ్రమల కాకుండా పర్యావరణహిత పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఇప్పటికే ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారన్నారు. తమ ప్రభుత్వం ప్రజలు తెలిపే నిరసన, అభ్యం తరాలను పరిగణనలోకి తీసుకుంటుందని, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. బుధవారం బయో ఏషియా-2025 సదస్సు ముగిసిన తర్వాత శ్రీధర్‌బాబు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైఫ్ సెన్సెస్ పాలసీపై త్వరలోనే క్యాబినేట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో లైఫ్‌సెన్సెస్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని, ఎక్కడ ఏర్పాటు చేయాలనేది త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

కానరాని జాడ

(మొదటి పేజీ తరువాయి)

కలిగిస్తున్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మట్టిని, బురద ను, నీటి ఊటను తొలగించేందుకు రెస్క్యూ టీం బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నారని చెప్పారు. రెస్క్యూ టీం భద్రత విషయంలోనూ జాగ్రత్తలు పాటిస్తూ ఎదురవుతు న్న అవాంత రాలను అధిగమిస్తూ రెండు రోజుల్లోనే ఆపరేషన్ పూర్తి చేసి కార్మికులను సురక్షితంగా బయటికి తెస్తామని మంత్రి మీడియాతో అన్నారు. 14వ కిలోమీటర్ వద్ద డేంజర్ జోన్‌గా ఉన్న ప్రాంతాన్ని అత్యంత పకడ్బందీగా రెస్క్యూ ఆపరేషన్ చేసి వీలైతే టీబీఎం మిషన్‌ని గ్యాస్ కట్టర్ల ద్వారా విడిభాగాలుగా చేసి సుమారు 16 టన్నుల బరువున్న టీబీఎం మిషన్ సైతం బయటికి తీస్తామని పేర్కొన్నారు. మరోపక్క ఎనిమిది మంది కార్మికులు బుర దలోనే కూరుకుపోయి సజీవ సమాధి అయి ఉంటారన్న వార్తలు పెరుగుతుండటంతో బాధిత కార్మికుల కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతున్నది.

ఎస్ఎల్‌బీసీ ఘటనపై విచారణ జరపాలి

పునర్విభజన జరిగితే దక్షిణాదికి 165 లోక్‌సభ స్థానాలే..

అట్లాస్ పేరుతో అధికార యంత్రాంగానికి వేధింపులా?

బీఆర్ఎస్ నేత కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 26: ఎస్ ఎల్‌బీసీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ట్వీట్ చేశారు. 'జీడిగింజ నల్లగున్నా నాకేటి సిగ్గు అన్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహా రం ఉంది. బాధ్యతాయుత సీఎంగా ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై దృష్టి సారించ కుండా ఎన్నికలు, ఢిల్లీ టూర్‌లు అంటూ తిరిగే నీకు పాలన అంటే ఏంటో తెలుసా? ఎస్ఎల్‌బీసీ ఒక డిజైన్ ఫెయిల్యూర్ అని కేసీఆర్ ఎప్పుడో చెప్పారు. అయినా పనులు ఆగిపోవడం వల్ల బేరింగ్‌లు పనిచేయడం లేదని అనడం ఏంటి? పనులు మొదలు పెట్టడానికి ముందు జీఎస్ఐ సర్వే ఏమైనా చేశారా? గుడ్డిగా కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారా? పనికిమాలిన లీకులు, అక్కరకు రాని చిట్‌చాట్లు దేనికి?" అంటూ పోస్ట్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన 14 నెలల పాలనలో 36 సార్లు ఢిల్లీ వెళ్లి 3 రూపాయలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. హస్తినా యాత్రలు మాని ఎస్ఎల్‌బీసీ కార్మికుల గోడు వినాలని.. బాధిత కుటుంబాలకు భరోసానివ్వాలని డిమాండ్ చేశారు. వెబ్‌సైట్ నుంచి రిపోర్టులను తొలగించడం, చేయని తప్పులకు అధికారులపై వేటు వేసినంత మాత్రాన, పదేళ్ల తెలంగాణ ముఖచిత్రాన్ని చెరిపేయడం ఈ సీఎం వల్లే కాదన్నారు. తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ (అట్లాస్) రిపోర్ట్‌తో బీఆర్ఎస్ దార్శనిక పాలనకు, కాంగ్రెస్ దద్దమ్మ పాలనకు ఉన్న స్పష్టమైందన్నారు. ఈ విషయం మింగుడుపడకే సీఎం రేవంత్‌రెడ్డి అధికార యంత్రాంగంపై వేధింపులకు దిగుతున్నాడని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్వి భజనతో దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లను నిర్ణయిస్తే ఐదు దక్షిణాది రాష్ట్రాలకు కేవలం 165 సీట్లు మాత్రమే వస్తాయన్నారు. ఈ విషయంలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తం చేసిన ఆందోళనలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నట్లు వెల్లడించారు.

వేం నరేందర్‌రెడ్డికి మండలి లేదా రాజ్యసభ?

ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు.. వాటిల్లో నాలుగు కాంగ్రెస్ ఖాతాలోకే!

హైదరాబాద్, ఫిబ్రవరి 26: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో.. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేయడానికి కసరత్తు ప్రారంభించింది. ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బీఆర్ఎసకు వెళ్లే అవకాశముండగా.. నాలుగింట్లో కాంగ్రెస్ పాగా వేయనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు, సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డికి ఈ సారి ఎమ్మెల్సీ పదవి దక్కుతుందనే అంచనాలున్నా.. ఒకవేళ సామాజికవర్గాల కూర్పులో ఇబ్బందులు ఎదురైతే.. వచ్చే ఏడాది ఖాళీ కానున్న రాజ్యసభ సీటుకు ఎంపిక చేసే అవకాశాలున్నాయి. అయితే.. వేం నరేందర్‌రెడ్డి అభ్యర్థిత్వంపై తీవ్రస్థాయిలో కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.

మజ్లిసకు అవకాశమిస్తారా?: ఐదు ఎమ్మెల్సీ సీట్లలో ఒకటి మజ్లిస్ సిటింగ్ స్థానం. ఇటీవలికాలంలో మజ్లిస్ పార్టీ కాంగ్రెస్ సర్కారుకు శాసనసభలో, బయట అన్ని విధాలుగా సహకరిస్తోంది. ఈ నేపథ్యంలో సిటింగ్ సీటును తమకే కేటాయించాలని మజ్లిస్ అధినాయకత్వం కోరుతున్నట్లు తెలిసింది.

మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డే అడ్డు

హైదరాబాద్, ఫిబ్రవరి 26: ఢిల్లీలో ప్రధానితో భేటీ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవి నీతి, అక్రమాలు, ఇటీవలి కాలంలో వరుసగా చోటు చేసు కుంటున్న మరణాలు అంశా లపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మెట్రోను కేంద్ర క్యాబి నెట్ ముం దుకు తీసుకురాకుండా అడ్డుకున్నదే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అని సీఎం ఆరోపించారు. తాను ప్రధానికి ఇచ్చిన ఐదు విజ్ఞప్తుల ను సాధించుకొని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులైన కిషన్ రెడ్డి, బండి సంజయ్ మీద ఉందన్నారు. తన వంతుగా చేయాల్సింది తాను చేశానని.. అవన్నీ తీసుకొచ్చి క్రెడిట్ వాళ్ల సొంతం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఇది చేస్తే.. బహిరంగ సభ ఏర్పాటు చేసి వారికి గండపెండేరం తొడుగుతానని, సన్మానం కూడా చేస్తానని సీఎం ప్రకటించారు. కేంద్రా నికి రాష్ట్రం నుంచి పన్నులు ఎంత కడుతు న్నామో అంతే స్థాయిలో రాష్ట్రాల కు వాటా రావాలని సీఎం డిమాండ్ చేశారు. హైదరా బాద్‌కు మెట్రో తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ, నాటి కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి అని సీఎం గుర్తు చేశారు. కేసీఆర్ మెట్రో విస్తరణ కోసం కేసీఆర్ చేసిందేమిలేదని, పదేళ్లు తాత్సారం చేశారన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన రూ. 22,500 కోట్లు అవసరమని, ప్రస్తుతం ఆదాయం రూ. 18,500 కోట్లు మాత్రమే వస్తుందన్నారు. వేతనాలకు రూ. 6,500 కోట్లు, వడ్డీలకు రూ. 6,800 కోట్లు చెల్లిస్తున్నామని సీఎం వివరించారు. ఆదాయం రూ. 22 వేల కోట్లకు పెంచేందు కు ప్రయత్నం చేస్తున్నామని ఆయన తెలిపారు.

కేటీఆర్ ఎందుకు విచారణ కోరడం లేదు

'రాష్ట్రంలో ముడు అనుమానాస్పద మరణాలు చోటు చేసుకున్నాయి. కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ దుబాయ్‌లో అనుమానాస్పదంగా మృతిచెందితే.. కేటీ ఆర్ ఎందుకు స్పందించలేదు. కేదార్, కాళేశ్వ రం కేసులు వాదిస్తున్న న్యాయవాది సంజీవ్ రెడ్డి, కేసువేసిన లింగమూర్తి మరణాలపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదు. జ్యూ డిషియల్ విచారణ ఎందుకు కోరడం లేదు?' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్ బిజినెస్‌లో కేదార్ భాగస్వామి అన్నారు. ర్యాడిసన్ బ్లూ డ్రగ్స్ కేసులో కేదార్ కీలక నిందితుడని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. త్వరలోనే డ్రగ్స్ కేసు విచారణకు రాబోతోందన్నారు. ప్రభుత్వాని కి ఫిర్యాదు వస్తే తాము విచారణ చేపడతా మని సీఎం తెలిపారు. కేదార్ మృతదేహం ఇండియాకు రానుందన్నారు. ఒక మాజీ ఎమ్మెల్యే దుబాయ్‌లోనే ఉన్నారని సీఎం తెలిపారు. కాళేశ్వరం సహా ప్రాజెక్టుల అక్రమాలపై ఇప్పుడేమి మాట్లాడబోనని, ఆ ప్రాజెక్టులపై సాంకేతిక నివేదికలు వచ్చాకనే మాట్లాడతానని అన్నారు.

ఎస్ఎల్‌బీసీ పాపం కేసీఆర్‌దే..

ఎస్ఎల్‌బీసీ రెస్క్యూ ఆపరేషన్లో 11 సంస్థలు పని చేస్తున్నా యని సీఎం చెప్పారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. ఎస్ఎల్బీసీ ని వంద శాతం పూర్తి చేసి తీరుతామన్నారు. కమీషన్లు రావనే ఉద్దేశంతోనే ఎస్ఎల్బీసీ పనులను కేసీఆర్ పక్కన పెట్టేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపిం చారు. పదేళు అధికారం లో ఉండి ఎలాంటి పనులు చేయకపోవడం తో ప్రమాదం జరిగిందన్నారు. కాంగ్రెస్ హయంలో 30 కిలోమీటర్ల టన్నెల్ పూర్త యిందని, కాంగ్రెస్‌కు పేరు వస్తుందని ఏ పనులు చేయకపోవడం వల్లే మెసీన్ బేరిం గ్స్ పాడయ్యాయని అన్నారు. కేసీఆర్‌కు ఈ ప్రాజెక్టులో ఏమి లాభం లేదనే పనులు పక్కన పెట్టారని, మెషీన్స్ అన్ని తప్పుపట్టి పోయి ఉండటం వల్లే ఈ ఘోరం జరిగిందని సీఎం తెలిపారు. ఎట్టి పరిస్థితు ల్లోనూ ఎస్ఎల్బీసీని పూర్తి చేస్తామని ఉద్ఘాటించారు. ప్రాజెక్టు పెరిగిన అంచనాల తో కలిపి రూ. 5,000 కోట్ల లోపే ప్రాజెక్టు పూర్తవుతుందని, ఇది పూర్తయితే మూడు న్నర లక్షల ఎకరాలకు నీళ్లు అందుతాయని సీఎం వివరించారు.

బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అంతా అవినీతే జరిగిం దని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం నిపుణుల కమిటీ నివేదికల ఆధారంగానే చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. ఇక ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై స్పందించిన సీఎం.. ఉప ఎన్నికలు ఎలా వస్తాయో అర్థం కావడం లేదన్నారు. 2014 నుంచి 2024 వరకు ఉన్న శాసన వ్యవస్థే ఇప్పుడూ ఉందని సీఎం గుర్తు చేశారు. పక్కపార్టీల నుంచి వచ్చిన వాళ్లను మంత్రులను చేస్తే ఉప ఎన్నికలు రాలేదని, ఇప్పుడు ఉప ఎన్నికలు ఎలా వస్తాయన్నారు.

చేయూతనివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్ట్‌లను కలిపేం దుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డుతో పాటు రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని సీఎం కోరారు.

మూసీ అభివృద్ధికి సహకరించండి..

తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నది తో ముడిపడి ఉందని.. రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని.. అంత ప్రాధాన్యమున్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, గుజరాత్ సబర్మతి ప్రాజెక్టు మాదిరిగా మూసీ ప్రాజెక్టు ఉంటుందని, గోదావరి నదిని మూసీతో అనుసంధానించి స్వచ్ఛమైన జలాలను అందించేందుకు 27 కొత్త మురుగునీటి శుద్ధి కేంద్రాలు మంజూరు చేయాలనిన్నారు. మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ గోదావరి నదుల అనుసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్ల ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని పీఎంకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని చెరువుల పునరుద్ధరణకు, ప్యూచర్‌సిటీకి ఆర్థికసాయం చేయాలని కోరారు.

అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలి : సీఎం

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ కేడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనుమతించాలచన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి: ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్రమోదీకి రాష్ట్రంలోని ఆరు పెండింగ్ అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి ఒక నోట్ ఇవ్వగా.. సీఎంకు ప్రధాని మోదీ పలు సూచనలు చేశారు. 2017 నుంచి 2022 వరకు పెండింగ్ అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రధాని ఆవాస్‌యోజన గ్రామీణ పథకం తెలంగాణలో అమలు కావడం లేదని, 2025 మార్చి 31 నాటికి సర్వే పూర్తి చేసి అర్హులను గుర్తించాలని పేర్కొన్నారు. శంషాబాద్ ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర నిధుల కింద రూ.150 కోట్లు చెలించాలని, మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో మూడు మొబైల్ కనెక్టివిటీ ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్‌కి విద్యుత్, వాటర్ సప్లయ్ కోసం రూ.1,365.95 కోట్లు చెల్లించాలని, తెలంగాణలో రెండు రైల్వే ప్రాజెక్టుల కోసం అటవీ అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని, మూడు నీటి పారుదల ప్రాజెక్టులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వాటి అంచనాలను సవరించి కేంద్రానికి పంపాలని సీఎం రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనను కూడా పీఎంకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

హెలికాప్టర్ నుంచి చూస్తే టన్నెల్‌లో ఏం జరుగుతుందో తెలుస్తుందా?

హైదరాబాద్: శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం ప్రమాద తదనంతర సహాయక చర్యల్లో తెలంగాణ ప్రభు త్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ ముఖ్యనేత, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యం వల్ల ఎనిమిది మంది ప్రాణాలు గాలిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారాయన. హరీష్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ నేతల బృందం ఇవాళ(గురువారం) ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్లేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో. సీనియర్ ఎమ్మెల్యే హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరగడం దురదృష్టకరం. కానీ, ఘటన జరిగిన తర్వాత ప్రభుత్వ స్పందన కరువైంది. ప్రమాదం జరిగి ఐదు రోజులు గడుస్తున్నా సహాయక చర్యలు అసలు ప్రారంభం కాలేదని.. అసలు ఏజెన్సీ ప్రతినిధుల మధ్య సమన్వయమే లేదని ఆరోపించారాయన. ప్రమాదంపై ఇప్పటిదాకా ప్రభు త్వమే ఒక అంచనాకి రాలేకపోతున్నారు. ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి మాటల మధ్య పొంతన లేదు. హెలికాప్టర్‌లో వెళ్తున్న మంత్రులు పోటాపోటీగా ఇంటర్వ్యూ లు ఇస్తున్నారే తప్ప సహాయక చర్యలను పర్యవేక్షించడం లేదు. సహాయక చర్యలను వెంటనే ప్రారంభించాలి. ఎంత తొందరగా సహాయక చర్యలు మొదలైతే అంత ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎనిమిది మంది ప్రాణాల కంటే.. ఎన్నికల ప్రచారమే ముఖ్యంగా కనిపిస్తోంది. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఆయన ఎగవేతల రేవంత్ రెడ్డి. అబద్ధాలు మాట్లాడుతారు కాబట్టి ఆయన అబద్దాల రేవంత్ రెడ్డి. ఎక్కడా సహాయక చర్యలపై ఆయన డైరెక్షన్ ఇచ్చినట్లు కనిపించడం లేదు. మొత్తం పది ఏజెన్సీలకు డైరెక్షన్ కరువైంది. సహాయక చర్యల్లో విఫలమై.. బీఆర్ఎస్‌పై బురదల్లే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ సహాయక చర్యలను చూడటానికి, మా అనుభవంతో సూచనలు చేయడానికి వెళ్తున్నాం. మూరు?లు మమ్మల్ని అడ్డుకుంటే ఏం జరుగుతుందో చూద్దాం



బీఆర్ఎస్ హయాంలోనే పనులు

కరోనా కారణంగా కూలీలు వెళ్లిపోవడంతో పనులు ముందుకు వెళ్ళలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కంటే ప్రభుత్వంలోనే అధిక పనులు చేశాం. కాంగ్రెస్ హయంలో పనులు మూలకు పడితే.. రూ.100 కోట్ల రూపాయల మొబలైజేషన్ నిధులిచ్చాం. మా హయాంలో 13 కిలోమీటర్లు పని జరిగింది. ఢిల్లీలో రేవంత్ రెడ్డి పై బురద జల్లుతున్నారు. ఆయన మాట్లాడాల్సింది సహాయక చర్యలపై. తన పాలన వైఫల్యం నుంచి బయటపడేందుకు గత ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. సందర్శన తర్వాత అన్ని విషయాలు మాట్లాడుతాను' అని హరీష్ రావు అన్నారు.

సోయిలేకుండా మాట్లాడుతున్నారు

ఎస్సెల్బీసీలో జరిగిన ప్రమాదం.. 8 మంది కార్మికుల ఆచూకీ తెలియకపోవడం దురదృష్టకరం. బీఆర్ఎస్ తరపున ఈ ప్రభుత్వానికి వారం రోజులు సమయం ఇచ్చాం. ఇవాళ హరీశ్ రావు నేతృత్వంలో ఎస్సెల్బీసీ వెళ్తున్నాం. ఘటనా స్థలాన్ని పరిశీలించి సూచనలు చేస్తాం. తెలంగాణ మంత్రులు సోయి లేకుండా మాట్లాడుతున్నారు. వాటర్, నీళ్లు కలిశాయి అని మాట్లాడటం బాధాకరం. మంత్రుల తీరు జాతీయ స్థాయిలో పరువు తీసేలా ఉంది. అందుకే ఆ పదవుల్లో ఉండాలో లేదో వాళ్లే తేల్చుకోవాలి.

– నల్లగొండలో మీడియాతో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

ఏపీ నీటి తరలింపును అడ్డుకోండి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం జరగాల్సి ఉండగా ఏపీ గైర్హాజరైంది. ఏపీ విజ్ఞప్తి మేరకు గురువారం ఉదయం 11 గంటలకు భేటీ నిర్వహి స్తామని కృష్ణా బోర్డు పేర్కొంది. దీనిపై తెలంగాణ నీటి పారు దల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, అంతరాష్ట్ర నీటి వనరుల విభాగం డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్, నల్లగొండ సీఈ వి.అజయ్‌కుమార్, వనపర్తి సీఈ సత్యనారాయణరెడ్డి తదితరులు కృష్ణా బోర్డు చైర్మన్ అతుల్ జైన్‌తో సమావేశమై తీవ్ర నిరసన తెలియజేశారు. ఇప్పటికే వాటాకు మించి కృష్ణా జలాలను ఏపీ వాడుకుందని, ఇంకా అనధికారికంగా నీళ్లను తోడుకోవడానికే సమావేశానికి గైరాపజరైందని రాహుల్ బొజ్జా మండిపడ్డారు. ఒంగోలు సీఈ జలసౌధలోనే ఉన్నా... ఈ సమావేశానికి రాలే దని తప్పుబట్టారు. శ్రీశైలం జలా శయం నుంచి నీటి తరలింపు ను తక్షణమే నిలిపివేయాలని ఏపీ తరలించిందని రాహుల్‌బొజ్జా ఫిర్యాదు చేశారు.

నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేను.. కాంగ్రెస్ ఫ్లెక్సీలలో నా ఫొటో వాడుతున్నారు

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఫిబ్రవరి 26: "నేను బీఆర్ఎస్ టికెట్‌తో గెలిచిన ఎమ్మెల్యేను. ఆ పార్టీలోనే ఉన్నాను. నా ఫొటోను కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలలో వాడుకొని ప్రజలను గందరగోళపరు స్తున్నారు. నా ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి" అంటూ గద్వాల జోగులాంబ జిల్లా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బీఆర్ఎస్ తరపున గద్వాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికైన కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొద్ది రోజుల్లోనే అసెంబ్లీ ఆవరణలోని బీఆర్ఎస్ చాంబర్‌లో ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన దృశ్యాలు బయటకు వచ్చాయి. ఆ తర్వాత మంత్రి జూపల్లి కృష్ణారావు గద్వాలలోని ఎమ్మెల్యే స్వగృహానికి వచ్చి కృష్ణమోహన్ రెడ్డిని తన వెంట పెట్టుకొని సీఎం దగ్గరకు వెళ్లి మాట్లాడించడం వంటి సంఘటనలు వెంటవెంటనే చోటుచేసుకున్నాయి. ఇదిలాఉండగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆ పది మంది ఎమ్మెల్యేలలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కూడా ఉన్నారు. ప్రస్తుతం కేసు కోర్టు పరిశీలనలో ఉన్నది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి తాను బీఆర్ఎసలోనే ఉన్నానని కాంగ్రెస్ ఫ్లెక్సీలలో తన ఫొటోను వాడుకొని తనను అప్రతిష్ఠపాలు చేస్తున్నారని ఈ నెల 11వ తేదీన జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. వివిధ సెక్షన్ల కింద కేసు నమో

విజయ బ్రాండ్‌ను కాపీ చేస్తున్న పలు ప్రైవేట్ డైరీలు

వినియోగ దారులు పరిశీలించి విజయ తెలంగాణ పాలను మాత్రమే కొనుగోలు చేయాలి...

విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి

సికింద్రాబాద్, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే ప్రతినిధి): విజయ బ్రాండ్ను కాపీ చేసి కొన్ని ప్రైవేటు డైరీలు వాడడం జరుగుతుందని, దానిని ప్రజలు గ్రహించి విజయ పాల ప్యాకెట్ మీద "విజయ తెలంగాణ" అని ఉన్నవి మాత్రమే విజయ్ డైరీ పాలని, వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ (టీజీడీడీసీఎఫ్)చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి సూచించారు. ఈ మేరకు బుదవారం రోజు లాలాపేటలోని విజయ డైరీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డెయిరీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి తో అమిత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ కోపరేటివ్ సొసైటీ చట్టం 1964 ప్రకారం ఫెడరేషన్ ప్రారంభమైందని చెప్పారు. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాష్ట్రాల విభజన జరిగినప్పటి నుంచి రెండు రాష్ట్రాల్లో వేరువేరుగా సంబంధిత ఫెడరేషన్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని వివరించారు. విజయ బ్రాండ్ అనేది ఇప్పటికీ ఉమ్మడి హక్కుగానే ఉందని అన్నారు. మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్, 1995 ప్రకారం స్వయం ప్రతిపత్తి తో పనిచేస్తున్న జిల్లాల పాల యూనియన్లు విజయ బ్రాండ్ ను వినియోగించుకోవడానికి వీల్లేదని పేర్కొన్నారు. విజయ బ్రాండ్ ను వినియోగించుకునేందుకు ఏ జిల్లా యూనియన్లకు సైతం అనుమతించలేదని పేర్కొన్నారు. కానీ రెండు రాష్ట్రాలలోని కొన్ని జిల్లా యూనియన్లు విజయ బ్రాండ్ ను చట్ట విరుద్ధంగా వినియోగించుకుంటున్నాయని ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటికే సిటీ సివిల్ కోర్టును తాము ఆశ్రయించగా విజయ బ్రాండ్ ను అనుకరించే ఏ ఉత్పత్తులను తయారు చేయడం, విక్రయించడానికి చేయకూడదని మధ్యంతర ఉత్తర్వులను రెండు రోజుల క్రితం జారీ చేసిందని తెలిపారు. ఇప్పటివరకు కర్నూలు జిల్లా పరస్పర సహాయ సహకార సంఘం, విఎన్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కృష్ణా జిల్లా పాల ఉత్పత్తి పరస్పర సహాయ సహకార సంఘం, శ్రీ సాయి దుర్గ ఎంటర్ప్రైజెస్, నెల్లూరు జిల్లా పరస్పర సహాయ సహకార పాల ఉత్పత్తి యూనియన్ లిమిటెడ్, ఆల్ రిచ్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్ఎస్ఆర్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్, విజయ మిల్క్ ప్రొడక్ట్స్, నార్మల్ మదర్ డెయిరీ తదితర సంస్థలు విజయ బ్రాండ్ ను అక్రమంగా వాడుకుంటున్నాయని తమ దృష్టికి వచ్చిందని వివరించారు. కోర్టు ఆదేశాల ప్రకారం పై సంస్థలతోపాటు ఏ ఇతర సంస్థలు విజయ బ్రాండ్ ను ఏ రకంగా వినియోగించిన చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని చెప్పారు.

తమ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విజయ తెలంగాణ బ్రాండ్ పేరుతో తెలంగాణ పాడి రైతుల నుండి పాలు కొనుగోలు చేసి, నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను ప్రజలకు అందిస్తోందని అన్నారు. విజయ బ్రాండ్ నాణ్యతకు, ప్రజల నమ్మకానికి చిరునామాగా మారిందని అభిప్రాయపడ్డారు. విజయ బ్రాండ్ ను వినియోగించుకుంటున్న ఇతర సంస్థల వలన ప్రజలు తమపై పెంచుకున్న విశ్వాసానికి విఘాతం కలిగే ప్రమాదం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రైవేటు డెయిరీలు నాణ్యత పాటించకుండా పాలు, ఇతర పాల ఉత్పత్తులను రూపొందించే ప్రమాదం ఉందని అన్నారు. తెలంగాణ ప్రజలు జాగ్రత్తగా ఉండి విజయ తెలంగాణ బ్రాండ్ ను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని వినియోగదారులు, విక్రేతలు, పంపిణీ దారులు అందరూ విజయ తెలంగాణ పాలు, పాల ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల తెలంగాణ పాడి రైతులకు మద్దతు ఇవ్వడమే కాకుండా రాష్ట్ర డెయిరీ రంగ అభివృద్ధికి తోడ్పడుతూ, రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను అందించినవారిగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు, ఫిర్యాదులు ఉన్నా 9121160569 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

బీసీ సంక్షేమ హాస్టల్‌ను సందర్శించిన మధుయాష్కి గౌడ్

విద్యార్థులు ఎదుర్కొంటున్న అవస్థలను స్వయంగా పరిశీలన

48 గంటల్లో విద్యార్థులకు వారి గదులలో ట్యూబ్ లైట్ల, ఫ్యాన్లు ఏర్పాటు చేయిస్తానని హామీ

మిగతా సదుపాయాలన్నీ ప్రభుత్వం, అధికార యంత్రాంగంతో మాట్లాడి పరిష్కరిస్తానని భరోసా..

మధుయాష్కీ తక్షణ స్పందన పై సంతోషం వ్యక్తం చేసిన విద్యార్థులు..

ఎల్ బి నగర్ ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): వనస్థలిపురం లోని బీసీ సంక్షేమ హాస్టల్ ను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్ సందర్శించడం జరిగింది. రెండు రోజుల కింద విద్యార్థులు వచ్చి వారు ఎదుర్కొంటున్న సమస్యలు మధుయాష్కి కి చెప్పిన నేపథ్యంలో.. మంగళవారం రాత్రి వనస్థలిపురం సుష్మ చౌరస్తాలోని వారి హాస్టల్ ను సందర్శించడం జరిగింది. విద్యార్థుల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు . ఫ్యాన్లు లేక, చదువుకోవడానికి లైట్స్ లేక.. సరైన భోజనం అందివ్వటం లేదని తెలుసుకొని చలించి పోయారు. పాత పడిపోయిన భవనం, కిటికీలు, తలుపులు సరిగా లేని కారణంగా గత అయిదారేళ్ళుగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను విద్యార్థులు వివరించారు. స్పందించిన మధుయాష్కీ మాట్లాడుతూ.తెలంగాణ కోసం కొట్లాడింది, తెలంగాణ తీసుకువచ్చింది బిడ్డల భవిష్యత్తు బాగుండాలని అని పేర్కొన్నారు. కానీ ఇంకా ఇలాంటి సంక్షేమ హాస్టల్లో అధ్వాహ్న పరిస్థితి చూస్తే బాధేస్తుందన్నారు. ప్రభుత్వం తో పాటు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి హాస్టల్స్ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఇప్పటికే బిసి వెల్ఫేర్ అధికార్లతో మాట్లాడడం జరిగిందన్నారు. విద్యార్థుల చదువులకు ఆటంకం అవుతున్న నేపథ్యంలో తమ మధు యాష్కి ఫౌండేషన్ ద్వారా 48 గంటల్లో విద్యార్థులకు ఫ్యాన్లు, లైట్లు తదితర అత్యవసర వస్తువులు అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. మిగతా సదుపాయాలను కూడా ప్రభుత్వం ద్వారా చేయిస్తానని విద్యార్థులకు భరోసా ఇవ్వడం జరిగింది. హాస్టల్ భవన యజమానితోను మాట్లాడి వెంటనే కొత్త తలుపులు, కిటికీలు ఏర్పాటు, తదితర అత్యవసర మరమ్మత్తులు చేయాలని సూచించడం జరిగింది. అంతేకాకుండా హాస్టల్లో సమస్యల విషయం పై బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశురాం తో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. కాగా 48 గంటల్లో విద్యార్థులకు ఫ్యాన్లు, ట్యూబ్లైట్లు ఏర్పాటు చేయిస్తారని మధుయాష్కీ పేర్కొనడంతో విద్యార్థులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా మధుయాష్కి సూచన మేరకు.బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ కేశురాం హాస్టల్ ను సందర్శించి సమస్యలు పరిష్కరిస్తాను విద్యార్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, దాము మహేందర్ యాదవ్, కొండోజు శ్రీనివాస్, అంతటి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శంభో శంకర.. హరి హర మహాదేవ.. శంభో శంకర

ఓంకార నాదంతో కిక్కిరిసిన ఆలయాలు

సికింద్రాబాద్ ఫిబ్రవరి 26 వాయిస్ టుడే ప్రతినిధి: మహా శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం ముషీరాబాద్ లోని వివిధ ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. హరి హర మహాదేవ శంభో శంకర... ఓంకార నాదంతో ఓం నమశ్శివాయ అంటూ భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చారు. రాంనగర్ గుండు అడిగిమెట్ వీరాంజనేయ స్వామి ఆలయంలో వేద పండితుల మంత్రోత్సల మధ్య పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేసి పూలు, పట్టు వస్త్రాలతో చక్కగా అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మహా శివుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు ప్రత్యేక పూల అలంకరణతో పాటు కలర్ కలర్ విద్యుత్ దీపాలతో చక్కగా అలంకరించి వచ్చిన భక్తులు చక్కగా పరమశివుని దర్శించుకోవడానికి ఎండోమెంట్ అధికారులు, ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసి భక్తులకు మహాశివుని దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి వారి రథోత్సవ వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల్ల పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఓల్డ్ రామంతాపూర్ శివాలయంలో శివరాత్రి సందర్భంగా బుధవారంరోజు రథోత్సవ వేడుక సాయంత్రం అంగ రంగ వైభవంగా,కన్నుల పండుగగా జరిగింది.మేడిపల్లి ప్రశాంత్ రెడ్డి ,మేడిపల్లి విశాల్ రెడ్డి గారి అద్వర్యం లో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి రథోత్సవ వేడుకకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి విచ్చేసి శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.తదనంతరం పరమేశ్వర్ రెడ్డి భక్తులందరికీ అభివాదం చేస్తూ.. భక్తులతో కలిసి నడుస్తూ స్వామి వారి రథోత్సవ వేడుకలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రామంతాపూర్ శివాలయం చైర్మెన్ నామ్ రాజీ రెడ్డి ,ధర్మకర్తలు సతీష్ గౌడ్ ,ముత్యాల జంగయ్య,మొగిలి లింగం ,మింగ శోభ ,బొడ్డు బాలయ్య ,రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు రఫీక్ ,లింగంపల్లి రామకృష్ణ ,తావీడబోయిన గిరిబాబు ,వల్లపు శ్రీకాంత్ యాదవ్,గరిక సుధాకర్ ,ఉపేందర్ రెడ్డి ,సుందీప్ ,రుద్రాల నర్సింహా ,షాగా శ్రీధర్ ,అరుణ్ సాయి,మెంగా రవి,జంగయ్య ,బులెట్ అశోక్ ,భాస్కర్ సచిన్ నాగ మల్లయ్య ,చింటూ ,ఉమేష్ పాల్గొన్నారు.

కూకట్‌పల్లి నియోజకవర్గంలో మహా శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

కూకట్ పల్లి, ఫిబ్రవరి 26(వాయిస్ టుడే): మహా శివరాత్రి పండుగ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం లోని కూకట్ పల్లి, మూసాపేట్, భరత్ నగర్, ఐడీఎల్ చెరువు రోడ్డు లోని పాపనాశేశ్వర గుడి, హౌసింగ్ బోర్డ్ రోడ్డు నె%శీ% 3,6 పలు శివాలయాలను దర్శించుకుని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ శివలింగానికి పాలు, తేనె మరియు నీరు వంటి పవిత్రమైన నైవేద్యాలతో రుద్రాభిషేకం చేశారు. ఈ నేపథ్యంలో బండి రమేష్ మాట్లాడుతూ ప్రజలకు మహా శివరాత్రి శు భాకాంక్షలు తెలిపారు. బుధవారం భక్తులు కఠినమైన ఉపవాసాన్ని పాటించి, పండ్లు, పాలు మరియు నీరు మాత్రమే తీసుకుని "ఓం నమః శివాయ" వంటి మంత్రాలను పఠిస్తు రాత్రంతా మేల్కొని జాగరణతో భజనలలో పాల్గొంటారని, ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ఉండాలని మహాదేవునికి ప్రార్థించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తూము వేణు, పి. నాగిరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సబ్సిడీ భాస్కర్, తూము కొండల్, ఎండీ నయీమ్, మైసయ్య, వెంకటేష్ యాదవ్, అశోక్, మేకల రమేష్, శివ చౌదరి, రమణ, శ్రీహరి పటేల్, శశిపాల్ సింగ్, నరేష్ , మైసయ్య యాదవ్, సంధ్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్ ఆలయ భక్తులకు రూ.1,01,000 విరాళం అందజేసిన పుప్పాల అజయ్ కుమార్

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 26(వాయిస్ టుడే) హైదరాబాద్ నగరంలోని పాతబస్తీ చత్రినాక వాస్తవ్యులు పుప్పాల అజయ్ కుమార్ బుధవారం మహా శివరాత్రి పురస్కరించుకుని శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వార్ల దర్శించుకున్నారు ఈ సందర్భంగా హైదరాబాద్ లోని కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానంలో వారి కుటుంబ సభ్యులతో పాల్గొని భక్తుల కోశాసం శాశ్వత నిత్య అన్నదానం చేయాలని తలంచి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో కుటుంబ సభ్యులందరూ సుఖ శాంతులతో ఆయురారోగ్యాలతో ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు. ఈ నేపథ్యంలో ఈ ఆలయానికి దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం కోసం నిత్యం దానం నిర్వహించాలనే సంకల్పంతో భక్తుడికి భగవంతుడికి అను సంధానంతో రూ. 1,01,000 అక్షరాల ఒక లక్ష వెయ్యి రూపాయలను భక్తి శ్రద్ధలతో ఆలయ నిర్వహణలో భాగంగా కర్మన్ ఘాట్ ఎగ్జిక్యూటివ్ అధికారిణి లావణ్యకు ఆలయంలో ఆ భగవంతుడి కృప కుటుంబ సభ్యులపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు వెంకటయ్య, వేణు గోపాల్ లయన్ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్ అమర్ సింగ్‌కి తుంగతుర్తి రవి జన్మదినశుభాకాంక్షలు

వాయిస్ టుడే న్యూస్, ఫిబ్రవరి 24 మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ అమర్ సింగ్ జన్మదినాన్ని పురస్కరించుకొని, ఆయన నివాసంలో నిర్వహించిన వేడుకలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పాల్గొని మాజీ మేయర్ అమర్ సింగ్ కి శాలువా తో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో సుదీర్ఘ కాలం ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ వేడుకలో కొల్తూరు సాయి, నీలారపు అయిలయ్య యాదవ్, బోడిగె ఉదయ్ రాజ్ గౌడ్, జలగం శరత్ గౌడ్,ప్రశాంత్,వెంకటేష్ గౌడ్, యాసారం సాయి,శ్రీకాంత్, రవి యాదవ్,నవీన్ తదితరులు పాల్గొని, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

నేర నియంత్రణలో సీసీటీవీలదే కీలక పాత్ర

బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు విశేష కృషి

జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

బాలానగర్ సీఐ నరసింహ రాజు

కూకట్ పల్లి : ఫిబ్రవరి 26(వాయిస్ టుడే): సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, ప్రజల భద్రత, సంక్షేమానికి నిరంతరం పోలీసు సిబ్బంది పనిచేస్తున్నట్టు బాలానగర్ సీఐ నర్సింహా రాజు తెలిపారు. సీఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఆయన ప్రజాశ్రేయస్సుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కమ్యూనిటీ పోలీసింగ్, స్థానిక సంక్షేమ సంఘ సభ్యులతో సమీక్షలు నిర్వహిస్తూ సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికై కృషి చేస్తున్నారు.

సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సీసీ కెమెరాల ప్రాముఖ్యతను స్థానికులకు వివరిస్తూ వాటిని ప్రతి ఒక్క కాలనీలో ఏర్పాటు చేసుకోవాలని, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నచో అవి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధిస్తాయని ప్రజలకు అవగాహన కల్పించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ జోన్ లో గడిచిన ఆరు మాసాలలో అత్యంత ఎక్కువ సంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసిన ఘనత సిఐ నరసింహా రాజుకు దక్కింది.

ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రజలు, వ్యాపార సంస్థలు, వివిధ సంఘాల వారు ముందుకు వచ్చేలా సీఐ రాజు చేపట్టిన అవగాహన కార్యక్రమాలను తెలుసుకొని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐపీఎస్, కూడా ఆయనను అభినందించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని. నేర నియంత్రణలో సీసీటీవీలు కీలక పాత్ర పోషిస్తాయని, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం భద్రతను పెంచడమేనని, సీసీ కెమెరాల మూలంగా సమాజంలో మంచి క్రమశిక్షణతో కూడిన జీవితం అలవర్చుకుంటున్నారని. కొన్ని నెలల నుంచి పోలీస్ శాఖలో సాంకేతికత ఆధారంగా కేసులను దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకొరకు కావలసిన సాంకేతిక సహకారం అందిస్తామని సీఐ నరసింహారాజు సూచించడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ముందుకు వచ్చారు. అంతేకాక ప్రతిరోజు సెక్టార్ వారీగా కమ్యూనిటీ పోలీసింగ్, సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాలు చేపడుతూ స్థానిక ప్రజల మన్నలను పొందుతున్నారు.

సృష్టి లయకారుడు శంకరుడు

ఆ శంకరుడి దీవెనలు ప్రతిఒక్కరి పై ఉండాలి: నీలం మధు ముదిరాజ్

సంగారెడ్డి ఫసల్వాదిలో జరుగుతున్న కోటి రుద్రాక్ష లింగార్చన కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొన్న నీలం మధు.. ఆ సృష్టి లయకారుడు శంకరుడు అని, ఆయన దీవెనలతో ప్రతిఒక్కరు ఆయురారోగ్యాలతో జీవించాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటేస్టేడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.

బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకుని సంగారెడ్డి నియోజకవర్గం సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఫసల్వాది గ్రామంలో బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి రుద్రాక్షలింగార్చన కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా కోటి రుద్రాక్ష లింగార్చన కార్యక్రమాన్ని చేపట్టి భక్తులలో ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా కృషి చేస్తున్న మహేశ్వర సిద్ధాంతి గారి సేవలను కొనియాడారు. అర్ధనారీశ్వరుడు, పరమ శివుడిని కొలిస్తే సకల సమస్యలు పరిష్కరమవుతాయన్నారు. మహాశివరాత్రి పవిత్రమైన పండుగ అని, శివ పార్వతులు వివాహం జరిగిన రోజు అన్నారు. శివరాత్రి సందర్భంగా శివ ఆరాధన చేస్తూ శివ పార్వతుల కల్యాణంలో పాల్గొంటే అన్ని పాపాలకు ప్రాయశ్చిత్తం లభించి కోటి జన్మల పుణ్యం దక్కుతుందని ప్రజలు విశ్వసిస్తారని తెలిపారు,ఈ కార్యక్రమంలో ఉత్సవా నిర్వాహకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి సందర్భంగా శివుడి దర్శనం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ యువనాయకుడు మాదిరి పృథ్వీరాజ్

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చేరు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పృథ్వీరాజ్ పటాన్‌చెరు పట్టణంలోని చైతన్య నగర్, గొల్లబస్తీ, జేపీ కాలనీలోని శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి శివనామస్మరణ చేస్తూ హారతులు అర్పించి, మహాదేవుని ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆయన మహాశివరాత్రి పవిత్రమైన మహిమాన్విత దినమని పేర్కొంటూ, శివుని కృపతో అందరూ ఆయురారోగ్యాలతో, శాంతి, సమృద్ధితో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాదిరి పృథ్వీరాజ్ ను శాలువాతో సత్కరించారు.

శివుని దర్శనం చేసుకున్న హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సి.వి ఆనంద్

జూబ్లీహిల్స్ 26ఫిబ్రవరి (వాయిస్ టుడే): రహమత్ నగర్ ఎస్పిఆర్ హిల్స్ లో ఉన్న గోరఖ్నాథ్ శివ మందిర్ ను సందర్శించి.. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన హైదరాబాద్ సిపి సివి ఆనంద్ ఆయనతోపాటు వెస్ట్ జోన్ డిసిపి విజయ్ కుమార్ ఎస్.ఆర్.నగర్ ,ఏసిపి వెంకట్ రమణ బోరబండ సిఐ ఎస్.వి.శేఖర్. స్ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు సిపి సివి ఆనంద గారిని శాలువాతో సత్కరించారు.

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవం

ఫిల్మ్‌నగర్: జూబ్లీహిల్స్‌లోని తితిదే వేంకటేశ్వరస్వామి ఆలయ అయిదో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణల నడుమ వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీవారు పెద్ద శేషవాహనంపై దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, కోలాటాలు, గోవింద నామస్మరణలతో మాడ వీధుల్లో ఊరేగారు.

సృష్టిలో ప్రతి అణువు పరమ శివుడే..

ఆ పరమేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలి : నీలం మధు ముదిరాజ్..

జహీరాబాద్ కేతకీ సంగమేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన నీలం మధు దంపతులు..

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చేరు: సృష్టిలో ప్రతి అణువు పరమ శివుడే అని పరమేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో పరిఢవిల్లాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటేస్టేడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఝరాసంఘం శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఆయన సతీసమేతంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమృత పుష్కరణలో జల లింగానికి పూజలు నిర్వహించి దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర గర్భాలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నీలం కు ఘన స్వాగతం పలికారు, పూజారులు వేద మంత్రాలతో వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించారు . ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఆ పరమ శివుడు ఆశిస్సులతో ప్రజలంతా బాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు హనుమంతరావు పాటిల్, ఆలయ ఈవో రుద్రయ్య స్వామి, సృజన్ పాటిల్,శేఖర్ పాటిల్, నవాజ్ రెడ్డి,గోపాల్,శ్రీకాంత్ రెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, బంటు శేఖర్, శివ,ఉత్సవా నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన రాకపోకలు..

అంబర్‌పేట: హైదరాబాద్ నుంచి ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లాలను అనుసంధానించే జాతీయ రహదారి-163పై అంబర్‌పేట ప్రాంతంలో కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను.. వాహనాల రాకపోకలకు వీలుగా బుధవారం సంబంధిత అధికారులు తెరిచారు. 2018లోనే పైవంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగినా.. రహదారి విస్తరణలో జాప్యం కారణంగా 2021లో పనులను ప్రారంభించి 2025 జనవరి చివరినాటికి పూర్తి చేశారు. నిర్మాణం పనుల కారణంగా.. స్థానిక గోల్నాక- ఛే నంబర్-శ్రీరమణ కూడళ్ల మధ్య రహదారిని కొన్నేళ్ల క్రితం మూసివేశారు. ఈ సందర్భంగా వాహనాలనూ దారి మళ్లించడంతో కోఠి, చాదర్‌ఘాట్ ప్రాంతాల మీదుగా రామంతాపూర్, ఉప్పల్, యాదగిరిగుట్ట, జనగాం, వరంగల్ వైపునకు రాకపోకలు సాగించే వేలమంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు ఫ్లైఓవర్ పూర్తవడంతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలతో.. శివరాత్రి పర్వదినం నుంచి దాని మీదుగా రాకపోకలకు అధికారులు అనుమతివ్వడంతో వాహనదారుల ఇక్కట్లు తొలగిపోయాయి.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల ఆందోళన

వారణాసికి వెళ్లే విమానం 4 గంటలు ఆలస్యం.. ప్రయాణికుల పడిగాపులు

శంషాబాద్: వారణాసి వెళ్లాల్సిన స్పైజెట్ విమానం దాదాపు 4 గంటలు ఆలస్యం కావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగిన సంఘటన బుధవారం చోటుచేసుకున్నది. ప్రయాణికులు తెలిపిన ప్రకారం.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పుణ్యస్నానాలు చేసేందుకు వెళ్తున్న ప్రయాణికులకు స్పైజెట్ ఎయిర్‌లైన్స్ అధికారులు షాక్ ఇచ్చారని తెలిపారు. ఉదయం 10 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వారణాసి వెళ్లాల్సిన విమానం సమయానికి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నదని, ప్రయాణికులు బోడింగ్‌పాసులు తీసుకొని లోపలికి వెళ్లారని చెప్పారు. తర్వాత ఎయిర్‌లైన్స్ సిబ్బంది సాంకేతిక సమస్యతో విమానం ఆలస్యమవుతుందని చావు కబురు చల్లగా చెప్పి వెళ్లిపోయారని ప్రయాణికులు వాపోయారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల పాటు ఎయిర్‌పోర్టులో వేచి చూసిన ప్రయాణికులను ఎయిర్‌లైన్స్ అధికారులు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని, కనీసం తాగునీరు ఇవ్వడంలేదన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎయిర్‌లైన్స్ అధికారులు ప్రయాణికుల వద్దకు వచ్చి సరైన సమాచారం చెప్పకుండానే వెళ్లిపోయారని, కుంభమేళాలో పుణ్యస్నానాలు చేసేందుకు విమానం టికెట్ బుక్ చేసుకున్న మాకు తిరిగి వచ్చే విమానం ఎలా దొరుకుతుందని ప్రశ్నించారు. వేలు పెట్టి టికెట్ తీసుకున్న మాకు కనీసం ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని వాపోయారు. ఎయిర్‌లైన్స్ అధికారులపై చర్యలు తీసుకోవాలని శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులను ప్రయాణికులు కోరారు. కుంభమేళా చివరి రోజు కావడంతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్తున్న ప్రయాణికులకు ఎయిర్‌లైన్స్ అధికారులు నిరాశే మిగిల్చారని పలువురు ప్రయాణికులు విమర్శించారు.

చెరువులో గుర్రపు డెక్క తొలగిస్తూ తండ్రీకొడుకులు మృతి

ఆసిఫ్‌నగర్: చెరువులో గుర్రపు డెక్క తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు తండ్రీకుమారుడు మృతిచెందిన ఘటన బుధవారం ఆసిఫ్‌నగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ కరీం(39) జీహెచ్ఎంసీలో పొరుగుసేవల ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న సాహిల్(15) శివరాత్రి సందర్భంగా పాఠశాల సెలవు కావడంతో తండ్రితో కలిసి లంగర్‌హౌస్ హుడా పార్కు చెరువులో పనికి వెళ్లాడు. తొలగించిన గుర్రపు డెక్కను గట్టుపై పడేసి తిరిగి వెళ్తున్న క్రమంలో సాహిల్ నీటిలో మునిగిపోతూ కనిపించాడు. తండ్రి బయటకు లాగేటప్పుడు ఆయనా పడిపోయాడు. బయటికి రాకపోవడంతో గమనించిన తోటి కార్మికులు అధికారులకు సమాచారమిచ్చారు. మరోవైపు విషయం తెలుసుకున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది మృతదేహాలను బయటికి తీశారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

వనస్థలిపురం, న్యూస్‌టుడే: ఆటోను వెనక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మియాపూర్ ఆదిత్య నగర్‌కి చెందిన సయ్యద్ ఇస్మాయిల్(48), ముషీరాబాద్ రామ్‌నగర్‌కు చెందిన ఎండీ గౌస్ (40)లు అన్నదమ్ములు. పండ్ల వ్యాపారం చేస్తుంటారు. గౌస్ కుమారుడు సులేమాన్ (15) తో కలిసి ముగ్గురు బుధవారం తెల్లవారుజామున రామ్‌నగర్ నుంచి బాటసింగారం పండ్ల మార్కెట్‌కు ఆటో ట్రాలీలో వచ్చారు. మార్కెట్‌లో పండ్లు కొనుగోలు చేసి.. రామ్‌నగర్ వెళ్తున్నారు. ఈ క్రమంలో వనస్థలిపురం పనామా సమీపానికి రాగానే ఆటోను గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఆటో జాతీయ రహదారిపై ఉన్న రెయిలింగ్‌ను ఢీకొని బోల్తా పడింది. ఇస్మాయిల్, గౌస్‌కు తీవ్రగాయాలు కావడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు.

నకిలీ కార్డులు.. మకిలీ పనులు

ముగ్గురు మైనర్లు సహా 18 మంది బంగ్లాదేశీయులపై కేసు

11 మంది అరెస్టు

హైదరాబాద్ చార్మినార్: నగరంలో బంగ్లాదేశ్ యువతులతో వ్యభిచార నిర్వహిస్తున్న గృహాలపై దక్షిణమండలం టాస్క్‌ఫోర్స్, ఖైరతాబాద్, చాదర్‌ఘాట్ పోలీసులు దాడులు నిర్వహించి 18 మందిపై కేసులు నమోదు చేసినట్టు టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వీరిలో ముగ్గురు మైనర్లను జువెనైల్ హోంకు పంపారు. 11మందిని రిమాండ్‌కు తరలించారు. బంగ్లాదేశ్‌కు చెందిన రాహుల్ షరిఫుల్ షేక్(26) అక్రమంగా కోల్‌కతా చేరాడు. అక్కడ నకిలీ గుర్తింపుకార్డులతో హైదరాబాద్ వచ్చి, ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పశ్చిమబెంగాల్‌కు చెందిన దళారులు ఆజారుల్(38), కమరుల్(36)తో ఉన్న సంబంధాలతో బంగ్లాదేశ్ నుంచి యువకులు, యువతులు, మైనర్లను అక్రమంగా భారత్‌కు చేరవేస్తున్నారు. పశ్చిమబెంగాల్‌కు వచ్చిన వీరికి కోల్‌కతాలో నకిలీ ఆధార్, ఓటరు గుర్తింపుకార్డులతో భారతీయ పౌరులుగా మార్చుతున్నారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోని నగరాలకు పంపేందుకు దళారులు ఒక్కొక్కరి నుంచి రూ.15-20 వేలు వసూలు చేస్తున్నారు. యువతులు, మైనర్ల పేర్లు మార్చి గుర్తింపుకార్డుల ఆధారంతో హైదరాబాద్, బెంగళూరు తరలిస్తున్నారు. అక్కడున్న బంగ్లాదేశీయులతో కలసి వారితో వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నారు. దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజు, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సైలు నర్సింహులు, ఆంజనేయులు, నవీన్ బృందం ఏకకాలంలో చాదర్‌ఘాట్, ఖైరతాబాద్ ప్రాంతాల్లోని గృహాలపై దాడులు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన ఇద్దరు మైనర్లు, నలుగురు యువతులను రెస్క్యూ గృహానికి తరలించారు. నగరానికి చెందిన మైనర్‌ను జువెనైల్ గృహానికి పంపారు. పశ్చిమబెంగాల్ నుంచి వచ్చి వ్యభిచార గృహాలకు సహకరిస్తున్న రాజత్ మండల్(39), జలీల్ సర్దార్(36), కమరుల్ షేక్(36), మహ్మద్ రోనీ ఖాన్(28), మహబూర్ సర్దార్(35), మహ్మద్ బిలాల్ రిజా ఉల్ షేక్(34), అజరుల్ షేక్(38), బంగ్లాదేశ్‌కు చెందిన రాహుల్ షరీఫుల్ షేక్(26), రోహిత్ మండల్(29), రిటోయ్ ఇస్లాం(24), బాబు షేక్(37)లను అరెస్ట్ చేశారు. నిందితుల్లో రిటోయ్ ఇస్లాం, రోని ఖాన్ జిలాల్ సర్దార్, రాజత్ మండల్‌కు నేరచరిత్ర ఉంది. వీరిపై తుకారాంగేట్, ఓయూ, రాజేంద్రనగర్ ఠాణాల్లో దోపిడీ, పోక్సో కేసులు నమోదయ్యాయి.

బైక్‌లు కొన్నారు.. ట్యాక్సీ డ్రైవర్లయ్యారు

నగరానికి నకిలీ గుర్తింపుకార్డులతో అక్రమంగా చేరిన బంగ్లాదేశ్ యువకులు వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. తోపుడుబండ్లు, బంగారు ఆభరణాల తయారీ కేంద్రాలు, పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరందరూ నకిలీ వివరాలతో హైదరాబాద్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేశారు. రాహుల్ షరీఫుల్, బాబు షేక్, రోనీఖాన్ ఓలా, ర్యాపిడో బైక్‌ట్యాక్సీలు నడుపుతున్నారు. బర్మా, బంగ్లాదేశ్‌కు చెందిన మరికొందరు బైక్, ట్యాక్సీ డ్రైవర్లుగా పనిచేస్తున్నట్టు గుర్తించారు.

ఎమ్మెల్సీ పోలింగ్ విధులను పకడ్బందీగా చేపట్టాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

ఖమ్మం, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులను సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల సంఖ్య ఆధారంగా అవసరమైన సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి అప్పజెప్పాలని సూచించారు. పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతూ, ఒకటికి రెండు సార్లు పోలింగ్ సామగ్రి సరిచూసుకొని తీసుకొని వెళ్ళాలని, ఎన్నికల నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ పోలింగ్ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని అన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం ఖమ్మం జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, మొత్తం 4089 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు 9 సెక్టార్ అధికారులు, 28 ప్రిసైడింగ్ అధికారులు, 27 అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులు, 58 ఇతర పోలింగ్ సిబ్బంది , 28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు, 8 రూట్లలో పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది, సామాగ్రిని తరలిస్తున్నామని, వీటి కోసం 8 ఆర్టీసీ బస్సులను సన్నద్ధం చేశామని అన్నారు.

ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన చల్లని నీరు, క్యూలైన్ల వద్ద టెంట్, ఇతర సౌకర్యాలు కల్పించామని, జిల్లాలోనీ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. ఉపాధ్యాయ ఓటర్లందరూ తప్పనిసరిగా ఫిబ్రవరి 27న జరిగే పోలింగ్ లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ పిలుపు నిచ్చారు. జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని అదనపు కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించు కోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. పోలింగ్ సామాగ్రితో ఎన్నికల విధుల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి తరలివెళ్లి, పోలింగ్ కేంద్రంలో గురువారం నాటి పోలింగ్ కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సహాయ రిటర్నింగ్ అధికారిణి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఎన్. అరుణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వల్లాపురం మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించిన తహశీల్దార్ సునీతా

ముదిగొండ మండలం ఫిబ్రవరి 26 వాయిస్ టుడే : ముదిగొండ మండల పరిధిలోని వల్లాపురం గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించిన ముదిగొండ మండల తహశీల్దార్ సునీతా ఎలిజబెత్ ఈ సందర్భంగా దర్శన టికెట్ల ధర ఎంత వసూలు చేస్తున్నారు ఎంత మందిని దర్శనానికి పంపిస్తున్నారని ఆరా తీసి దర్శన టికెట్లు నిర్ణయించిన ధరకు మాత్రమే డబ్బు వసూలు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు అనంతరం ప్రజలతో కలిసి క్యూ లో వెళ్లి స్వామి వారిని దర్శనం చేసుకుని కానిస్టేబుల్ సిబ్బందితో కలిసి భద్రతా సంరక్షణ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు అలాగే ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలతో మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటూ గుడికి వచ్చిన ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు అనంతరం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వల్లాపురం శివాలయంలో మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దంపతులతో కలిసి పూజలో పాల్గొన్నారు.

ముదిగొండ ఎమ్మెల్సీ ఎన్నికలు... పోలింగ్ ఏర్పాట్లు పూర్తి

పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన ఎలక్షన్ సెక్టార్ ఆఫీసర్ ఖమ్మం జిల్లా టూరిజం ఆఫీసర్ బి.సుమన్ చక్రవర్తి, ముదిగొండ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తహశీల్దార్ సునీతా ఎలిజబెత్

ముదిగొండ మండలం ఫిబ్రవరి 26 వాయిస్ టుడే : ఫిబ్రవరి 27న తెలంగాణలో గ్రాడ్యుయేట్,టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే 7 ఉమ్మడి జిల్లాల్లో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి అయితే ముదిగొండ మండలంలో పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది ఎన్నికల సంఘం.. ఈ సందర్భంగా ఎలక్షన్ సెక్టార్ ఆఫీసర్ ఖమ్మం జిల్లా టూరిజం ఆఫీసర్ బి.సుమన్ చక్రవర్తి, ముదిగొండ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తహశీల్దార్ సునీతా ఎలిజబెత్ తో కలిసి పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ క్యామ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తామని అన్నారు విద్యావంతులైన ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. వారి వెంట ఎలక్షన్ పీఓ టీ.శ్రీనివాస్, పోలింగ్ ఆఫీసర్ 1 సయ్యద్ రఫీ ఉద్దీన్,పోలింగ్ ఆఫీసర్ 2 షేక్ యాకూబ్ పాషా,పోలింగ్ ఆఫీసర్ 3 బి. సక్రు, ఎమ్ఓ బీ రతన్ రాజ్ ఉన్నారు.

బీసీల పల్లెబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడాలి: పురమల్ల శ్రీనివాస్

బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్.

బీసీ పల్లె బాట పోస్టర్ ఆవిష్కరణ.

కరీంనగర్, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన పల్లెబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కరీంనగర్ లో బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన పల్లెబాట పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన బీసీల చైతన్యం,ఐక్యతను బలపరచాలని మేమెంతో మాకంత వాటా పేరుతో జరుగుతున్న పల్లెబాట కార్యక్రమం బీసీలను కదిలించడానికి ఎంతో ఉపయోగపడుతుందని, బీసీలు,ప్రజా సంఘాలు, అంబేద్కర్ వాదులు, యువత,విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలు రాజ్యాధికారం కోసం ఒక్కటై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ మాట్లాడుతూ జనాభాలో సగభాగమైన బీసీలు బీసీల హక్కుల సాధన అభివృద్ధి కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి బీసీ ఐక్యతగా అవుతున్నారని, ప్రతి పల్లెను కదిలించడమే లక్ష్యంగా పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్, ధర్మపురి అసెంబ్లీ అధ్యక్షులు ముదాం శ్రవణ్ కుమార్, నాయకులు అశ్లం పాల్గొన్నారు.

వెనటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఏ మేడిపల్లి సత్యం

గంగాధర, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తదనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలోపాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన ఎంఎల్ఏ కవ్వంపల్లి

మానకొండూర్, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గంలోని పలు మండలాల్లో శివాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లి గ్రామంలోని శివాలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం గంగిపల్లి గ్రామంలో జరుగుతున్న మల్లికార్జున స్వామి జాతరకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. జాతరకు విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ పురోహితులు, ఆలయ కమిటీ బాధ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం తెలిపారు. మల్లికార్జున స్వామి వారి కళ్యాణానికి ఎమ్మెల్యే తలంబ్రాలను నెత్తిన మోసుకొని మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి విచ్చేసి స్వామివారికి సమర్పించారు.శంకరపట్నం మండలం చింతలపల్లి గ్రామంలోని శివాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. తిమ్మాపూర్ మండలం అల్గునూరులోని శివాలయాన్ని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయాల సందర్శన సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సృష్టి, స్థితి, లయకారుడైన ఆ పరమశివుడు లింగాకారంలో ఆవిర్భవించిన ఈ పరమ పవిత్ర పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ఉపవాసం,జాగరణలతో జరుపుకోవాలని కోరుతూ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.ఆ భోళాశంకరుడు తెలంగాణ రాష్ట్ర ప్రజలను ముఖ్యంగా మానకొండూర్ నియోజకవర్గ ప్రజలందరి బాధలను తొలగించి ఆనందం,శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆ స్వామిని కోరినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల పార్టీ అధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెల యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, కోండ్ర సురేష్, మీస సత్యనారాయణ, ప్రభాకర్, వాల అంజిత్ రావు, సాయిరి దేవయ్య, పిసిసి సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, శంకరపట్నం మండల పార్టీ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, పార్టీ నాయకులు శ్రీనివాస్,మొలంగూరి సదానందం, ఓదెలు, సంతోష్ కుమార్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంది లక్ష్మీనారాయణ రెడ్డి, పార్టీ జిల్లా కార్యాలయ ఇన్చార్జి గోపు మల్లారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తమ్మనవేని రమేష్, ఆలయ చైర్మన్ కంది రామచంద్ర రెడ్డి,పార్టీ నాయకులు కంది అశోక్ రెడ్డి కాలువ మల్లేశం,టీ. సంపత్, పెండ్యాల రాజిరెడ్డి పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కాసాని ఐలయ్య

- తమ్మినేని వీరభద్రం

ఖమ్మం, ఫిబ్రవరి 26, (వాయిస్ టుడే): ప్రాణం పోయేంతవరకు ప్రజల కోసమే పోరాడిన కాసాని ఐలయ్య పేద ప్రజల పక్షపాతి అని సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం నాడు సిపిఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో సుందరయ్య భవనంలో ఇటీవల మరణించిన సిపిఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన తమ్మినేని ప్రసంగిస్తూ రైతు కూలీల, కార్మికుల, వృత్తిదారుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలకు ఐలయ్య నాయకత్వం వహించాడన్నారు. కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాలలో పేదలకు ఇండ్ల స్థలాల కోసం అలుపెరగని పోరాటాలు చేశాడని, వేలాది మందికి ఇండ్ల స్థలాలు దక్కాయంటే ఆ ఘనత ఐలయ్యదేనని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వృత్తిదారులందరిని ఐక్యం చేసి పోరాటాలు నిర్వహించాడన్నారు. పలుసార్లు అనారోగ్యానికి గురైనా, చివరకు క్యాన్సర్‌లాంటి జబ్బుకు గురైనా పోరాటబాట వదలలేదని, ఆయన మరణం ప్రజాతంత్ర ఉద్యమాలకు లోటని ఆయన ఆశయాలను కార్యకర్తలు ముందుకు తీసుకుపోవాలని కోరారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ రైతు సంఘాలను, వృత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి రాజీలేని పోరాటాలు చేసిన ఐలయ్య జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శం అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ భూస్వాములు, పెత్తందారులు, దోపిడీ వర్గాలపై పోరాడిన కాసాని గొప్ప పోరాటయోధుడని, ఆయన ఆశయ సాధనకు ముందుకు సాగుదామని చెప్పారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా ఐలయ్య చిత్రపటానికి తమ్మినేని పూలమాల వేయగా, నాయకులంతా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, బండి పద్మ, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, జిల్లావ్యాపితంగా వచ్చిన జిల్లా కమిటి, డివిజన్ కమిటి, మండల కార్యదర్శులు, పూర్తికాలం కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలాద్రీశ్వర స్వామి సేవలో ఎంపీ వద్దిరాజు దంపతులు

సత్తుపల్లి ఆర్సి ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): మహా శివరాత్రి సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీతో కలిసి నీలాద్రీశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు.ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం భవన్నపాలెం సమీపాన కొలువైన స్వయంభు నీలాద్రీశ్వర స్వామి వారి ఆలయాన్ని బుధవారం వారు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర –విజయలక్ష్మీ పుణ్య దంపతులు హోమంలో పాల్గొని, శివలింగాన్ని పూలమాలలు, పంచామృతాలతో అభిషేకించి,గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు.వేద పండితులు వారిని కండువాలతో గౌరవించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు, ఆశీర్వచనాలు పలికారు.ఎంపీ రవిచంద్రతో కలిసి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దుగ్గిదేవర వెంకట్ లాల్, యూత్ లీడర్స్ సుంకర చిరంజీవి,ఆకుల సాయి, మద్దెల భానుప్రతాప్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

మహాశివరాత్రి వేడుకలలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

రాష్ట్ర ప్రజలు సుబీక్షంగా ఉండాలని సంకల్పం

రాష్ట్ర ప్రభుత్వం, రాహుల్ గాంధీ పేరిట పూజలు

జాతరలో చిన్న నాటి మిత్రులతో కలసి మిఠాయిలు కొనుక్కొని సందడి

మధిర ఆర్సి, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): రాష్ట్ర ప్రజలు సబీక్షంగా ఉండాలని, ప్రపంచం లో తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా వారంతా క్షేమం గా ఉండాలని ఆ శివపార్వతులను వేడు కున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన శ్రీమతి మల్లు నందినితో కలిసి స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మిపురం లోని పురాతన శివాలయం లో, మధిర నియోజకవర్గ కేంద్రంలో నీ శివాలయం లో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ కుటుంబం పేరిట దేవాలయాల్లో పూజలు చేయించారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి శివపార్వతుల ఆశీస్సులు ఉండాలని ఆయన పూజలు నిర్వహించారు. స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో శివపార్వతుల పూజ అనంతరం జాతరలో ఏర్పాటుచేసిన దుకాణాల్లో చిన్ననాటి మిత్రులతో కలిసి కలియతిరిగారు.లిమిఠాయిలు కొనుగోలు చేసి మిత్రులకు పంచుతూ ఆనందంగా గడిపారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు.కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి సందర్భంగా కరీంనగర్ పట్టణం పాత బజార్ శివాలయంలో పరమ శివుణ్ణి దర్శించుకున్న కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

పరమ శివుడికి పూజలు చేసిన మాజీ మేయర్ సునీల్ రావు

కరీంనగర్, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నగర మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు దంపతులు స్థానిక 33వ డివిజన్ హరిహర క్షేత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో గల శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయంను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని, ఆ పరమ శివుణ్ణి ప్రార్థించానని తెలిపారు. ఆలయ ధర్మకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

వేయి స్తంభాల ఆలయంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అమోఘం

వరంగల్ (వాయిస్ టుడే) ఫిబ్రవరి 26 : ఏవివి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరం లోని చారిత్రాత్మక వేయి స్తంభాల దేవాలయంలో ఏవివి కళాశాల, వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్, మరియు కాకతీయ యూనివర్సిటీ బయోటెక్నాలజీ లకు చెందిన 60 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బుధవారం నాడు ఆలయం సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది.

ఈ కార్యక్రమంలో వాలంటీర్లు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా క్యూలైన్లో మరియు మెడికల్ అసిస్టెన్సీ ముఖ్యంగా వాటర్ డిస్ట్రిబ్యూషన్ తదితర సేవా కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొని భక్తులు ఇటువంటి ఇబ్బందులకు గురికాకుండా తమ సేవలను అదించి అధికారులను మెప్పించారు. ఈ కార్యక్రమంలో పోగ్రామ్ ఇన్చార్జ్ ఏవివి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు, కేయూ బయోటెక్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి రాధిక మరియు వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆజం సీనియర్ వాలంటీర్లు దేవి శ్రీ ప్రసాద్, సాత్విక్ ,హరిణి(ఏవివి) హర్షవర్ధన్, పూజ, సాత్విక్, రోహిత్ (వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ)విష్ణు ,రాకీ ,ప్రతాప్ అండ్ పూజ (కేయూ బయోటెక్నాలజీ) తదితరులు పాల్గొన్నారు.

శివనామా స్మరణతో తన్మయం పొందిన భక్తులు

- రాజన్న సన్నిధిలో ప్రముఖులు..
- కితకిటలాడిన క్యూలెన్లు
- అరటిపళ్ళు, మజ్జిగ ప్యాకెట్లు అందజేసిన మై వేములవాడ ట్రస్ట్

వేములవాడ, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శివ నామ స్మరణతో మారు మ్రోగింది.. క్యూ లైన్లో భక్తులు గంటల తరబడి నిల్చొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ పరిసర ప్రాంతంలో ఉన్న క్యూ లైన్లను పర్యవేక్షించారు. మై వేములవాడ ట్రస్ట్ వారు భక్తులు అరటిపళ్ళు, 25 వేల మజ్జిగ ప్యాకెట్లు వితరణ చేశారు. అవంచానియా సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలు, ముదుసాలి వాళ్ళు, నూతన జంటలు, అందరు శివునికి ప్రీతి కరమైన మహాశివరాత్రి రోజున దర్శనం చేసుకునీ పులకించిపోయారు. కోడె మొక్కులు చెల్లించుకుని స్వామి వారి ప్రసాదాలు సేవించారు. రాష్ట్రం నుండే కాకుండా మహారాష్ట్ర, ఒరిస్సా, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ తదితర మూల ప్రాంతాల నుండి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మహాశివరాత్రి జాతర 3 రోజులు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ గుడి చెరువులో భక్తులు దీపాలు, పండ్లు, పూలు ఏర్పాటు చేసి జాగరణ చేసి ఒక్కపొద్దులు విడుస్తారు. అనంతరం బద్దిపోచమ్మ అమ్మ వారిని దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణం అవుతారు.

మహా లింగార్చన

లింగోద్భావ సమయాన మహా శివుని లింగం ఉద్భావం అవుతుందనీ శాస్త్ర పురాణం. వేములవాడ రాజన్న ఆలయంలో సాయంత్రం 6 గంటలకు ఆలయ అద్దాల మండపంలో మట్టి ప్రమిదలతో లక్ష లింగాలు లింగ రూపంలో అమర్చి దాదాపు 3 గంటల పాటు వేద మంత్రాలతో లింగచర్చన చేస్తారు. లింగోధ్భవ సమయంలో పరమేశ్వరుడు పులకించిపోయి భక్తులకు కోరిన కోరికలు తీర్చుతాడని ప్రగాఢ నమ్మకం. స్వామి వారికీ తిరుమల తిరుపతి దేవస్థానం వారు స్వామి వారికీ పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆలయం మొత్తం పర్యవేక్షించారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, అర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, స్వామి వారికీ మొక్కులు చెల్లించుకున్నారు.

ఓరుగల్లులో హర హర మహాదేవ శివనామ స్మరణ తో మారుమొగిన శైవ క్షేత్రాలు

దర్శనం కోసం దేవాలయాల ప్రాంగణాల్లో బారులు తీరిన భక్తులు.

భక్తుల దర్శనాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు.

వరంగల్ (వాయిస్ టుడే) ఫిబ్రవరి 26 : మహాశివరాత్రి సందర్భంగా నగర వ్యాప్తంగా అన్ని శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి బుధవారం నాడు ఉదయము తెల్లవారుజామునుండే భక్తులు ఆలయాల వద్ద క్యూ లైన్ లో బరులు తీరారు. శివాలయాల్లో సామూహిక రుద్రాభిషేకాల కోసం బారులు తీరిన భక్తులతో దేవాలయ ప్రాంగణంలో కోలాహలం సందడి నెలకొంది. రుద్రాభిషేకాలు మహా రుద్ర హోమాలతో శివపార్వతుల కళ్యాణ మహోత్సవ వేడుకలతో దేవాలయాల సందర్భంగా పూలడెకరేషన్ లు విద్యుత్ లైట్లతో చలువ పందిర్లతో ఆలయలను అలంకరణ చేశారు. నగరంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలైన, కిల వరంగల్ శంభుని గుడి, కాశిబుగ్గలోని కాశిబుగ్గ కాశీ విశ్వేశర ఆలయం, పిన్నవారి వీధిలోని దుర్గేశ్వరాలయం, రామన్నపేట లోని రామలింగేశ్వర ఆలయం, మట్టెవాడ భోగేశ్వరాలయం కోటిలింగాల గుడి,స్టేషన్ రోడ్డు కాశి విశ్వేశ్వర ఆలయం, ఈ ప్రధాన దేవాలయలలో ఉదయం తెల్లవారుజాము నుండే పూజలు, అభిషేకాలు, రుద్రహోమాల కోసం బారులు తీరిన భక్తులతో దేవాలయాలు భక్తుల తో కిటకిటలాడాయి. పలు దేవాలయాల్లో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, శివపార్వతుల కళ్యాణం హరికథ, కూచిపూడి నృత్యాలు శివ తత్వంపై అద్భుతిక ప్రసంగాలు భక్తులను అలరించాయి. ఆయా దేవాలయ పరిసరాల్లో అధికారులు పటిష్టమైన బందోబస్తు ట్రాఫిక్ జామ్ కాకుండా రోడ్ల మళ్లింపు చర్యలు చేపట్టారు.

కాగజ్ నగర్‌లో వరుస దొంగతనాలకు ముగింపు
ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్ నగర్, వాయిస్ టుడే : కాగజ్ నగర్ టౌన్ పరిధిలోని బాలాజీ నగర్ మరియు పెట్రోల్ పంప్ ప్రాంతాల్లో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. 24.02.2025 రాత్రి, బాలాజీ నగర్ లోని ఒక ఇంట్లో దొంగతనానికి ప్రయత్నించిన ఇద్దరు దొంగలు, పోలీసుల సైరన్ వినగానే పరారయ్యారు. ఈ ఘటన సీసీటీవీలో రికార్డయ్యింది. దీంతో పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టి, అనుమానితులపై నిఘా పెట్టి, 26.02.2025 ఉదయం %చీ=% చౌరస్తా వద్ద ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.అరెస్టైన నిందితులు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మోహమ్మద్ ఖలీల్, షేక్ ఖలీద్ గా గుర్తించారు. దర్యాప్తులో ప్రధాన నిందితుడు ఖలీల్ గతంలో ఖమ్మం, ఒంగోలు, గుంటూరు, మధ్యప్రదేశ్ సహా తొమ్మిది దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. కాగజ్ నగర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు దొంగతనాలు నమోదు కాగా, దొంగిలించిన వెండి వస్తువులు (88.30 తులాలు), ?3,700 నగదు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన ఇన్‌స్పెక్టర్ పి. రాజేంద్ర ప్రసాద్, కానిస్టేబుళ్లు రాజు, సంపత్, వెంకటేష్ ను %ఖుర్రా% బి. రామానుజం అభినందించారు. ప్రజల భద్రత కోసం కష్టపడుతున్న పోలీసులకు ఆయన ప్రోత్సాహం అందజేశారు.

అక్రమ దేశీదారు రవాణాపై ఎక్సైజ్ అధికారుల దాడి... వాహనం పట్టివేత

ఆసిఫాబాద్ జిల్లా,కాగజ్ నగర్, వాయిస్ టుడే : మహారాష్ట్ర నుండి కాగజ్‌నగర్ పట్టణానికి దేశీదారు రవాణా చేస్తున్న వాహనాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. నిషేధ మరియు ఎక్సైజ్ ఉప కమిషనర్, ఆదిలాబాద్ దేవిడ్ రవికాంత్, జిల్లా నిషేధ మరియు ఎక్సైజ్ అధికారి, ఆసిఫాబాద్ బి.జ్యోతి కిరణ్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ శివారులో వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో స్కూటీ వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న రూ. 18,000 విలువైన 400 దేశీదారు 90 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన అబ్దుల్ సోహైల్‌పై కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ వి.రవి తెలిపారు.ఈ దాడిలో ఎస్ఐలు పి.లోభానంద్, ఐ.సురేష్, ఇతర ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

-వాహనాల్లో పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది.

అన్ని కేంద్రాల్లో పటిష్ఠ భద్రత.

ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్.

పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ పూర్తి

వరంగల్ (వాయిస్ టుడే) ఫిబ్రవరి 26 : వరంగల్, ఖమ్మం,నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. వరంగల్ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్ని హాజరయ్యాయా లేదా అని ఈ సందర్భంగా కలెక్టర్ ఆరా తీశారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా పోలింగ్ ప్రక్రియను జరిపించాల్సిన తీరు గురించి, వెంట తీసుకెళ్లాల్సిన బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సామాగ్రి గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును కలెక్టర్ గమనించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించడానికి పంపిణీ కేంద్రానికి వచ్చిన పిఓ, ఓపిఓ, మైక్రో అబ్జర్వర్లు, అధికారులు పోలింగ్ లో ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ప్రకారం ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ సిబ్బందితో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బస్సులను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి పీ.ఎస్ లకు తీసుకెళ్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. కాగా, జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలలో గురువారం ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణల్లో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అందించామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి సిబ్బంది తమకు కేటాయించిన వాహనాలలో నేరుగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుని పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటారని తెలిపారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా

కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. జిల్లాలో,ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 2352 మంది ఉన్నారని వివరించారు. 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో పీ.ఓ, ఓపీఓలను నియమించామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్. సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, సంబంధిత అధికారులు, సెక్టోరల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బజారును, సైడు కాలువను ఆక్రమించిన చిరుకొండ శ్రీనివాస్

చోద్యం చూస్తున్న పంచాయితీ అధికారులు

పాలేరు, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే) : పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వేంకటగిరి గ్రామంలో బజారు,సైడ్ కాలువ సుమారు 33 అడుగులు ఉండాల్సింది పోయి కేవలం సగం కూడా ఇప్పుడు అక్కడ భౌతికంగా లేదు. అట్టి స్థలాన్ని చిట్టుకొండ శ్రీనివాస్ అట్టి బజారును, సైడు కాలువను అక్రమంగా ఆక్రమించుకొని రెండడుగుల మేర మట్టితో నింపుకొని ఏకంగా తనకు గల సుమారు వెయ్యి గజాల స్థలంతో పాటు సుమారు 100 గజాల స్థలాన్ని యదేశ్చగా తన స్థలంలో కలుపుకోవడమే కాకా ఫినిషింగ్ రాళ్ళను కూడా పాతి హద్దును నిర్ణయించుకొన్నట్లు గ్రామస్థులు ఆరోపించారు. ఆక్రమణదారుని ధుర్బుద్ధితో సైడ్ కాలువలో ప్రవహించే మురుగు నీరు సైడ్ కాలువను ఆక్రమించి మోరస పోయడంతో ఆ మురుగునీరు సీసీ రోడ్డుకు చివరగా కొనసాగుతున్న బజారుకు అడ్డంగా ప్రవహిస్తూ అడుగులోతు కాలువగా ఏర్పడింది. ఫలితంగా గ్రామస్థులు ఆ సీసీ రోడ్డు నుండి ప్రయాణించే ప్రజలు, రైతులు, కూలీలు, మహిళలు, చిన్నారులు నడవటానికే నానా రకాలుగా ఇబ్బంది పడుతూ నరకయాతన అనుభవిస్తున్నారు. అదే విదంగా అక్కడ నుండి నేరుగా ఖమ్మం పని మీద వెళ్లి వచ్చే సైకిల్ ప్రయాణికులకు, ద్విచక్ర వాహన దారులు అవస్థలు పడుతున్నారు. ఒక్కక్క సారి వాళ్ళు తమ వాహనాలు అదుపుతప్పి పడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని వాహనదారులు ఆవేదన చెందుతున్నట్లు తెలిసింది. కొత్తగా మున్సిపాలిటీ ఏర్పడటం, పైగా జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ఆక్రమించిన స్థలమే లక్షల రూ. విలువ చేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత అక్రమ దందా జరుగుతున్న కనీసం అధికారులు ఆ వైపు కూడా వెళ్లి పరిశీలించిన సందర్భం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పైగా ఈ మురుగు నీరు ప్రవాహం మూలంగా అనేక మంది ప్రజలు నిరసిస్తూ ఆక్రమణ దారులను నిలదీచిన

కొద్దిపాటి చిరు ఘర్షణలు జరుగుతున్నా విషయం తెలిసిన పంచాయితీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు చోద్యం చూస్తూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపనలు వస్తున్నాయి. పంచాయితీ అధికారుల మౌనం వెనుక ఉన్న మతలబు ఏంటనేది సామాన్యులు కూడా ఇట్టే అర్థం అవుతుందనేది యదార్థంగా గోచరిస్తుంది..చిన్న విషయానికే హడావుడి చేసే పంచాయితీ అధికారులు, స్పెషల్ ఆఫీసర్ కిమ్మనకుండా కళ్ళు ఉండి చూడలేని దూతరాష్ట్రులుగా చోద్యం చూస్తున్నారంటే ఆ విలువైన స్థలం ఆక్రమణలో వారి పాత్ర ఏమిటి, లేదా ఉదాసీనా వైఖరి అవాలంభిస్తున్నారా లేక మరేమైనా అర్థం, పరమార్థం దానిలో దాగివుందా ఏంటనేది జవాబు లేని మిలియన్ డాలార్ల ప్రశ్నగా నిలుస్తుంది. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు ఆక్రమించుకొన్న బజారు, సైడ్ కాలువను స్వాధీనం చేసుకొని తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పంచాయితీ అధికారులకు ఆ గ్రామ ప్రజలు సూసిస్తున్నారు.పంచాయితీ కార్యదర్శి దామళ్ళ కిరణ్ వివరణ.... ఈ ఆక్రమణ దారి, సైడు కాలువ ఆక్రమణ విషయాన్నీ పంచాయితీ కార్యదర్శి దామళ్ళ కిరణ్ వివరణ కోరగా నాకు ఈ విషయం తెలియదని,నా దుష్టికి ఎవరూ తీసుకొని రాలేదని చెప్పారు. ఈ విషయంపై గురువారం వేంకటగిరి గ్రామానికి వెళ్లి అట్టి బజారును పరిశీలిస్తానని చెప్పారు. ఒక వేళ ఆక్రమణకు గురైతే తిరిగి స్వాధీనం చేసుకొంటానని, ఆక్రమించుకొన్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి నా పై అధికారుల దుష్టికి తీసుకెళ్లుతానని చెప్పారు.మా పని విధానంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. నేను ప్రజలకు జవాబు దారిగా వ్యవహరిస్తానని ఎలాంటి అవకతవకలు తావులేదని, అంతా పరదర్శకంగా వ్యవహరిస్తానని చెప్పారు..

మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

భవిష్యత్తులో పొట్లపల్లి దేవస్థాన అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్

వాయిస్ టుడే ప్రతినిధి ఫిబ్రవరి 27 హుస్నాబాద్ ప్రతినిధి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామంలో మహా శివరాత్రి సందర్భంగా హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి లో స్వయం భూ రాజ రాజేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ భక్తులకు అందుతున్న సౌకర్యాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వర త్వరగా క్యు లైన్ లలో ఉన్న భక్తులను దర్శనానికి పంపించాలని అధికారులకు సూచన భక్తులతో ముచ్చటించిన మంత్రి పొన్నం ప్రభాకర్ అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్ లో హెల్త్ చెకప్ చెపించుకున్న మంత్రి.

పొట్లపల్లి స్వయం భూ రాజరాజేశ్వర స్వామి హుస్నాబాద్ ప్రాంత వాళ్ళే కాదు ఇతర జిల్లాల వాళ్ళు కూడా కొంగు బంగారం..పెద్ద ఎత్తున ప్రతి సోమవారం స్వామి వారిని దర్శించుకుంటారు. ఈరోజు మహా శివరాత్రి ఉదయం నుండే అభిషేకాలు జాగరణ లతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మహా శివరాత్రి సందర్భంగా అధికారులు ముందే సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసుకొని అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. భవిష్యత్ లో దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తం. 20 సంవత్సరాలుగా పొట్లపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రతి శివరాత్రి కి దర్శించుకుంటున్న ఈసారి ఆరెపల్లి నుండి పందిల్ల వరకు వయ పొట్లపల్లి మీదుగా డబుల్ రోడ్డు వేయడం జరిగింది. భక్తులకు శాశ్వత డ్రింకింగ్ వాటర్ అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. ఈ ప్రాంతం అంత ప్రాజెక్టులు పూర్తి అయినా మంచి పంటలతో సుభిక్షంగా ఉండలని అందరూ ఆయు ఆరోగ్యాలతో ఉండలని ఆ రాజ రాజేశ్వర స్వామిని వేడుకుంటున్నా.

అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 26: గురువారం జరగనున్న ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్ లో అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు తన ఓటు హక్కును వినియోగించుకొని విజయవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం కొత్తగూడెం శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయులు అందరూ ప్రశాంతమైన వాతావరణం లో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు గాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జిల్లాలో 23 పోలింగ్ కేంద్రాల్లో కొనసాగుతుందని ఆయన తెలిపారు. జిల్లాలో ఏడు రూట్లు ఏర్పాటు చేయడం జరిగిందని,ప్రతి రూటుకి ఒక సెక్టార్ అధికారి ఒకటు రూట్ ఆఫీసర్ను నియమించడం జరిగిందని తెలిపారు. పిఓలు మరియు ఏపీవోలకు పోలింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు చేపట్టవలసిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు.ఓటర్లుఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు ఉండవు. బ్యాలెట్ పేపర్ మాత్రమే ఉంటుంది.బ్యాలెట్ పేపర్ పై పోటీ చేస్తున్న అభ్యర్థి పేరు, ఫొటో ఉంటాయి.ప్రాధాన్య క్రమంలో ఓటరుకు నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడి లో "1" నెంబరు వేయాలి. ఎన్నికల. అధికారులు ఇచ్చిన వాయిలెట్ పెన్నుతో మాత్రమే వేయాలి అని కలెక్టర్ సూచించారు. ఓటర్లు ఎన్నికల సంఘం అనుమతించిన ఏదేని గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. ఓటర్లకు వారి యొక్క క్రమ సంఖ్య వివరాలు తెలిసే విధంగా పోలింగ్ కేంద్ర వద్ద ఓటర్ రిక్గ్నైజేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఎలక్షన్ సూపర్డెంట్ దారా ప్రసాద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహణ

ఈసుగాం శివ మల్లన్న ఆలయంలో రాజకీయ నేతల సందడి

ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్ నగర్ మండలం, వాయిస్ టుడే : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సిర్పూర్ నియోజకవర్గంలోని ఈసుగాం శివ మల్లన్న దేవస్థానం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించబడిన వేడుకలు ఆహ్లాదకరంగా కొనసాగాయి.

పూజల్లో పాల్గొన్న ప్రముఖులు.....

ఈ సందర్భంగా సిర్పూర్ శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు తెల్లవారుజామున రుద్రాభిషేకం నిర్వహించి, శివుని ఆశీర్వాదం పొందారు. ఆయన మాట్లాడుతూ, ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు విస్తరించి, ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థించారు.అలాగే, ఎమ్మెల్సీ దండే విట్టల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ జెడ్పి ఛైర్మెన్ కోనేరు కృష్ణ రావు, టిడిపి ఇంచార్జ్ గుల్లపల్లి ఆనంద్ లావణ్య దంపతులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రావి శ్రీనివాస్ తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు

భక్తులకు. అన్నదానం, పండ్ల పంపిణీ.....

వైభవంగా జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల్లో అన్నదానం, తీర్థ ప్రసాదాల పంపిణీ, పండ్లు, మజ్జిగ వితరణ విశేషంగా ఆకర్షించాయి.డా. పాల్వాయి హరీష్ బాబు స్వామి దర్శనానికి విచ్చేసిన భక్తులకు పళ్ల రసం పంపిణీ చేశారు.కోనేరు కోనప్ప కుటుంబ సభ్యులు భక్తులకు మజ్జిగ, అన్నప్రసాదం పంపిణీ చేశారు.శ్రీ మిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో అరటి పండ్లు, సంత్రలు పంపిణీ చేశారు.

ముసలమ్మ గుట్ట శివాలయంలో ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి సందర్భంగా చింతలమానేపల్లి మండలం కర్జెల్లి గ్రామ శివారులో గల ముసలమ్మ గుట్ట శివాలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. డా. పాల్వాయి హరీష్ బాబు భాజపా నేతలతో కలిసి అక్కడ పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ మహోత్సవ వేడుకల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు, ఆలయ అధికారులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన భారీ మద్యం నిల్వ పట్టివేత

ఆసిఫాబాద్ జిల్లా, చింతలమానేపల్లి, వాయిస్ టుడే : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పై పోలీసులు దాడి చేసి, రూ. 21.50 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. కాగజ్ నగర్ డీఎస్పీ రామానుజం గారి నేతృత్వంలో, కౌటాల సీఐ ముత్యం రమేష్, చింతలమానేపల్లి ఎస్ఐ నరేష్, బెజ్జూర్ ఎస్ఐ ప్రవీణ్, కౌటాల ఎస్ఐ మధుకర్ లతో కూడిన బృందం నిర్వహించిన ఈ దాడిలో, శ్రీనిధి వైన్ షాప్ ఓనర్ కోడిపక సత్యనారాయణ ఏ సంతోష్ మరియు అతనితో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గూడెం గ్రామానికి చెందిన కంపరి అంజన్నలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అలాగే, అదే గ్రామానికి చెందిన రామగిరి శంకర్ వద్ద రూ. 98,400, కుశతురివారి ఆకాశ వద్ద రూ. 19,200, సంతోష్ జైష్వాల్ వద్ద రూ. 9,130 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో అక్రమంగా మద్యం అమ్మిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ విజయవంతమైన ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ గారు అభినందించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు.

గ్రామ పంచాయతీలలో కారోబార్‌ల పాత్ర కీలకం

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయితీలలో విధులు నిర్వహిస్తున్న కారోబార్ ల పాత్ర ఆయా గ్రామాలలో చాలా కీలకంగా మారింది గ్రామ స్థాయిలో పాలనలో పంచాయితీ కార్యదర్శులకు సహాయంగా విధులు నిర్వహించే వీరు పరిశుద్యం పరిశుభ్రత పై పనిచేస్తారు చెత్తను డంప్ యార్డ్ లకు చేరేలా సిబ్బందితో పని చేయిస్తారు మరియు సురక్షిత మంచి నీరు కోసం వాటర్ క్లోరినేషన్ తదితర పనులను పర్యవేక్షించడం తో పాటు గృహ అనుమతులు, పన్నుల వసూలు చెయ్యడం మరియు రికార్డ్ ల నిర్వహణ తదితర పనులు చెస్తుంటారు అన్ని ప్రభుత్వ పథకల నిర్వహణలో నిబద్ధతతో పని చేస్తారు ,అంతే కాకుండ కొన్ని సార్లు పరిశుధ్య సిబ్బంది లేకపోతె కారో బార్ లే గ్రామ పరిశుభ్రత కోసం గ్రామ పంచాయితీ ట్రాక్టర్ కు డ్రైవర్ లుగా మారుతు చెత్తను డంప్ యార్డ్ కు పంపుతున్నారు ,శానిటేషన్ పనులు కూడ కొన్ని సందర్భాలలో చేస్తు మరియు పనులలో నిత్యం శ్రద్ధతో విధులు నిర్వహిస్తు వారికి వచ్చే అతి తక్కువ జీతంతో భారంతో జీవితం గడుపుతున్నారు

ఉద్యోగ భద్రతా కల్పించాలి

– మహిపాల్ రాజోల్ల, కారొబర్‌ల సంఘం మండల అధ్యక్షులు

రాష్ట్రం వ్యాప్తంగా గ్రామ పంచాయితీల పరిపాలనలో కీలకంగా ఉండి అన్ని విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న కారోబార్ లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రతా కల్పించి పే స్కెల్ లో జీతం చెల్లించాలని, పంచాయితీ ట్రాక్టర్ డ్రైవర్ లకు ,పంపు అపరెటర్ లకు ప్రత్యేకంగా జీతం చెల్లించాలని దాంతో పాటు 51 జీవో రద్దు చేసి పనికి సరిపడా వేతనం అందించాలని, పెండింగ్ లో ఉన్న జీతాలు తక్షణమే విడుదల చెయ్యాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పెట్రోల్ బంక్‌లో పెట్రోలు బదులు నీళ్లు వాహనదారుల ఆగ్రహం

ఆసిఫాబాద్ జిల్లా, కౌటాల, వాయిస్ టుడే : కౌటాల మండలం, మొత్తం పేట గ్రామంలోని ఒక ప్రముఖ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కు బదులు నీళ్లు మిశ్రమంగా వస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం దహేగాం మండలం బీబ్ర గ్రామానికి చెందిన దుర్గం వసంత్ తన వాహనానికి పెట్రోల్ పోయించుకున్నాడు. అయితే, తన వాటర్ బాటిల్‌లో పెట్రోల్ నింపి పరిశీలించగా, అందులో సుమారు 25% నీరు మిశ్రమంగా ఉన్నట్లు గుర్తించాడు.ఈ విషయాన్ని వాహనదారులు బంక్ సిబ్బందిని ప్రశ్నించగా, వారు నిర్లక్ష్యంగా స్పందించారని వాహనదారులు ఆరోపించారు. దీనితో ఆగ్రహించిన ప్రజలు బంక్ వద్ద ఆందోళనకు దిగారు.

తనిఖీలు చేపట్టని అధికారులపై వాహనదారుల మండిపాటు.....

వాహనదారులు పెట్రోల్ బంక్‌లపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "పెట్రోల్‌తో నీరు మిశ్రమం అవుతుండటంతో మా బైకులు, కార్లు తరచూ రిపేరింగ్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇది మా ఆర్థిక భారం పెంచుతోంది" అని వాహనదారులు వాపోయారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు రంగంలోకి దిగి పెట్రోల్ బంక్‌ల తనిఖీ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా చేవెళ్ల పార్లమేంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినం

చేవెళ్ల, ఫిబ్రవరి 26(వాయిస్ టుడే) చేవెళ్ల పార్లమేంట్ సభ్యుడు, మరియు భారత పార్లమెంట్ విప్ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినం సంధర్భంగా , చేవెళ్ల లో ఎర్పాటు చేసిన కార్యక్రమంలో శంకర్ పల్లి బిజేపి సినియర్ నాయకులు, జిల్లా నాయకులు, మున్సిపల్ నాయకులు , ఎంపి ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శంకర్ పల్లి మున్సిపల్ మరియు మండల కేంద్రం లో , చేవెళ్ల మాజి ఎమ్మెల్యే , నియోజకవర్గం బిజేపి ఇంచార్జీ కేఎస్ రత్నం సమక్షంలో ,బర్త్డే కేక్ కట్ చేసి, ప్రతి సంవత్సరం ఎంపి శ్రీ విశ్వేశ్వర్ రేడ్డి ఫౌండేషన్ తరపున , మండల , మున్సిపల్ లోని పదవతరగతి టాపర్ లకు బ్యాంకు చేక్కు అమౌంట్లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో బిజేపి రాష్ట్ర నాయకులు ఎల్ ప్రభాకర్ రేడ్డి, జిల్లా అభివృద్ధి కమిటి సభ్యులు ప్రభాకర్ రేడ్డి, మాజి మార్కెట్ కమిటి చేర్మేన్ పరమేశ్వర్ రేడ్డి, బిజేపి జిల్లా కౌన్సిల్ సభ్యులు వాసుదేవ్ కన్న, మున్సిపల్ బిజేపి అధ్యక్షులు దయాకర్ రేడ్డి, నాయకులు, మాశేట్టి పాండు, రాములు, వీరేందర్ , లోకేష్, సానికే ప్రవిణ్, బిసోల్ల వేంకట్, ఓడిఎఫ్ అంజనేయులు, వేంకట్ రాంరేడ్డి, హరిగౌడ్, బిజేపి కార్యకర్తలు, మరియు పాఠశాల విధ్యర్థులు, వారి పేరేంట్స్ పాల్గొన్నారు.

కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా ఫిబ్రవరి 26: (జడ్చర్ల)నవాబుపేట్ మండల పరిధిలోని పోమాల గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి కుక్కింద నరసింహులు కూతురు రాఘవి(19)అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుది శ్వాస విడిచింది రాఘవి అకాల మరణానికి చింతిస్తూ,పోమాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కొందుటి నరేష్ ఆధ్వర్యంలో రూ.5000లను కుక్కింద రాఘవి అంతిమ సంస్కారానికై ఆర్థిక సహాయంగా అందించి,రాఘవి కుటుంబ సభ్యులకు,పోమాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈకార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు కుక్కింద రాములు,ప్రధాన కార్యదర్శి మందుల యాదయ్య,డైరెక్టర్లు ఇట్యాల రాజశేఖర్,బుడ్డోల్ల గోపాల్,మాజీ సర్పంచ్ కృష్ణయ్య,గ్రామ పెద్దలు గుట్టమీది నరసింహులు,కుక్కింద వెంకటయ్య,కొండనోల్ల జంగయ్య,యం.గోపాల్,సి. రాములు,ఎ.శ్రీహరి,యంమహేష్,బి.ఆంజనేయులు,కె.రాములు,యం.ఎల్లప్ప,యం.య దాదగిరి,యం.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రధాని ఆసుపత్రిలో అరుదైన చికిత్స



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 26: ప్రధాన ఆసుపత్రి లో సింగరేణి వైద్యులు డా.మాలతి గైనకాలజిస్ట్ బుధవారం సింగరేని ఉద్యోగి బార్య గైనిక్ సమస్యకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఈ శస్త్ర చికిత్సకు డా.కృష్ణమూర్తి డా.రవళి థియటర్ సిబ్బంది సహకరించినారు. ఈ చికిత్స కు హైదారాబాద్ కు రిపర్ చేస్తే సుమారు లక్షకు పైగా ఖర్చు అవుతుందని పేసెంటు కుటుంబ సభ్యులు సింగరేణి డాక్టర్స్ ను అభినందించారు.

ఎల్లారెడ్డిపేట మండలంలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

కన్నుల పండగగా శివపార్వతుల కళ్యాణం

వాయిస్ టుడే ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 26 : ఎల్లారెడ్డిపేట మండలంలో మహాశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. శివపార్వతుల కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో ఆలయ పూజారి రాచర్ల హనుమాన్ల శర్మ, శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో ఉమా శంకర్ పంతులు, శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామ పురోహితులు రాచర్ల దయానంద్ శర్మ, శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి టెంపుల్ లో ఆలయ ప్రధాన అర్చకులు మధు గుండయ్య శర్మ, అక్క పెల్లి శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుగ్గ వాసు శర్మ ఆధ్వర్యంలో నారాయణపూర్ శివాలయంలో పురోహితులు దయనంద్ శర్మ ఆధ్వర్యంలో మాఘ అమావాస్య సందర్భంగా గణపతి నవగ్రహ పూజ అర్చన, హారతి, పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు, శివపార్వతుల కళ్యాణము కన్నుల పండుగగా జరిగాయి. కళ్యాణం సందర్భంగా మహిళలు ఒడిబియ్యం పోసే కార్యక్రమాలలో పాల్గొని మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలో భక్తులు అనేక మంది పాల్గొన్నారు. మాఘ అమావాస్య సందర్భంగా కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు గ్రామస్తులు మహిళలు దర్శించుకున్నారు.

గత ప్రభుత్వం మా బ్రతుకులను ఆగం చేసింది ప్రజాపాలన ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలని విజ్ఞప్తి

కనీస సౌకర్యాలు లేక మా బ్రతుకులు ఆగమైపోతున్నాయి

మాకు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వాలి

వాయిస్ టుడే ప్రతినిధి ఫిబ్రవరి 27హుస్నాబాద్ ప్రతినిధి : సిద్దిపేట జిల్లా అక్కెనపేట మండలంలోని హథిరాం (అంబతండా) గ్రామస్తులం మా గ్రామంలోని సమస్యలపై మాకు కనీస సౌకర్యాల కల్పనకై పోరాటం చేస్తూ మీ అందరికీ మా యొక్క బాధలు తెలియజేయాలని ఉద్దేశంతో మా యొక్క కన్నీటితో చెప్తున్న మాటలు ఇవి దయచేసి వినండి అని అథిరాం తండావాసులు మాట్లాడుతూ

గండిపల్లి ప్రాజెక్టు గురించి అందరికీ నమస్కారం

సార్ మేము పంచరాయ్,తండా అంబతండా, ఏనియా తండా, డాక్య తండా, గుండ్ల సింగారం తండా, వాసులం సార్ .. మాకు 2009లో ప్రాజెక్టు పనులు స్టార్ట్ అయినవి అందులో సార్ మేము బావులు బోర్లు మరియు భూములు అతి తక్కువ రేటుకు గవర్నమెంట్ కు సహకరించి భూములు ఇవ్వడం జరిగింది కానీ సార్ మాకు ఈ తండావాసులకు అప్పటి ప్రభుత్వం 2009లో మమ్మల్ని సర్వే చేసి ప్రాజెక్టులో ఆల్రెడీ 11 ఇండ్లు ప్రాజెక్టులో పోయినాయి ఎఫ్ ఆర్ ఎల్ 100 లో 86 ఇల్లు పోతున్నాయి కొన్ని ఇండ్లు ఉంటున్నాయి కాబట్టి పై అధికారులతో జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడి వాటిపై డిసిషన్ తీసుకుంటామని చెప్పి అప్పటి ప్రభుత్వం కొన్ని రోజులు గడిపేసింది దాని తర్వాత మన అదృష్టవంతో మన తెలంగాణ మన ప్రభుత్వం మన స్వరాష్ట్రం అని అప్పుడు ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడ్డ కే చంద్రశేఖర రావు గండిపల్లి ప్రాజెక్టు దగ్గర వచ్చి కూర్చొని ఇది చాలా చిన్న ప్రాజెక్టు ఇది ఎవరికి సరిపోదు దీన్ని 0.5 ఉన్నదాన్ని 1.5 కి మార్చండి అని అధికారులకు సూచన ఇచ్చి అందులో భాగంగా గండిపల్లిలో ఉన్న 11 తండాలు మరియు అంకుశపూర్ ఊర్లో మూడు తండాలు పోతున్నాయి మొత్తం వీరికి నష్టపరిహారం ఇచ్చి వీరిని ఆదుకొని ప్రాజెక్టు పనులు ముమ్మరంగా ప్రారంభించండి అని చెప్పిన కేసీఆర్ 10 సంవత్సరాలు గడుపుకున్నాడు కానీ తట్టెడు మట్టి కూడా పోయకుండానే హామీలతో సరిపెట్టుకున్నాడు దాని తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం జరిగింది కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా రేవంత్ రెడ్డి కూడా ఈ ప్రాజెక్టును సందర్శించడం జరిగింది. అప్పటికి పార్లమెంట్ సభ్యుడు అభ్యర్థి మన పొన్నం ప్రభాకర్ కూడా రేవంత్ రెడ్డి తో కలిసి రావడం జరిగింది దాని తర్వాత పొన్నం ప్రభాకర్ గారికి టికెట్ ఇవ్వడం జరిగింది ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం జరిగింది హుస్నాబాద్ నుంచి మంత్రి పదవిని కూడా ఆకర్షించుకోవడం జరిగింది కానీ మాకు పొన్నం ప్రభాకర్ చెప్పేది ఒకటే . గండిపల్లికి వచ్చినప్పుడు అల్లా మీకు పాత ప్రాజెక్టు కావాల్నా కొత్త ప్రాజెక్టు కావాలా ఎత్తు పెంచమంటారా తగ్గించమంటారా అనే మాటతో మాత్రమే సరి పెట్టుకోవడం జరుగుతుంది

మేం కోరుకునేది ఒకటే ప్రాజెక్టులో భాగంగా మాకు గత 15 సంవత్సరాల నుండి ఒకే ఇంట్లో నాలుగు ఫ్యామిలీలు మరియు మూడు ఫ్యామిలీలుగా బతుకుతున్నాం మాకు కొత్తగా ఇల్లు కట్టుకుందామని అంటే జిపి నుండి పర్మిషన్ లేవు కరెంట్ బిల్లు పర్మిషన్ లేదు కొత్త నల్లాల కనెక్షన్ లేదు ఏది మొదలుపెట్టిన మేము అభివృద్ధికి నోచుకునే ఉంటున్నాము మాకు మీరు దయదలసి మేము కోరుకునేది సార్ మాకు ప్యాకేజీలు మరియు ఇండ్ల డబ్బులు ఇచ్చి మమ్మల్ని తొందరగా ఆదుకొని ప్రాజెక్టులో నీళ్లు నింపి మమ్మల్ని ఆర్ అండ్ ఆర్ కాలనీ ఇచ్చి ఆదుకోగలరని మిమ్మల్ని కోరుతున్నాం సార్ విలువైన భూమిని అతి తక్కువ రేటుకు రెండు లక్షల పదివేల మాత్రమే ఎకరం భూమి ఇచ్చి త్యాగం చేసిన మాకు ఎలాంటి న్యాయం ఇప్పటివరకు జరుగుతలేదు సార్ మీరు ఈ విషయం దృష్టిలో పెట్టుకుని మాకు తగిన న్యాయం చేస్తారని కోరుకుంటున్నాం

మహాశివరాత్రి సందర్భంగా పండ్ల పంపిణీ

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా, ఫిబ్రవరి 26 : నవాబుపేట్ బీశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి,మాజీ డిసిసి అధికార ప్రతినిధి దుష్యంత్ రెడ్డిలు మండల పరిధిలోని పోమాల గ్రామంలో నెలకొన్న శివాలయం దగ్గర భక్తులకు పండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈసందర్భంగా భక్తులు తమ సంతోషాన్ని వ్యక్తంచేస్తూ,ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి,మాజీ డిసిసి అధికార ప్రతినిధి దుష్యంత్ రెడ్డిలకు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరలింగం, కుమార్, రామకృష్ణ, నర్సింలు, నరేష్, యాదయ్య, నరసింహులు,గణేష్,శ్రీకాంత్,విక్రమ్,వెంకటేష్,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్ వీరభద్ర స్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మండలం సైదాపూర్ గ్రామంలోని వీరభద్ర స్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత కుటుంబ సమేతంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముందుగా శివయ్యకు అభిషేకం చేసి అనంతరం వీరభద్ర స్వామికి మొక్కలు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు,ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని శివయ్యను వేడుకున్నారు..

శివాలయాలలో భక్తుల రద్దీ

రాయికల్(వాయిస్ టుడే): రాయికల్ మండలంలోని శ్రీ రాజరాజేశ్వర నాగ ఆలయం,చెన్న కేశవ నాథ ఆలయం మరియు శివలింగం శివాలయంలో మరియు పలు దేవాలయాలలో మహా శివరాత్రి పర్వదినాన భక్తుల రద్దీ అధికంగా కనిపించింది, భక్తులు స్వామి వారిని దర్శించి వారి మొక్కులు చెల్లించుకున్నారు రాయికల్ పట్టణంలో గల శ్రీ చెన్నకేశవ పంచముఖ లింగేశ్వర ఆలయం మరియు మండలంలో గల కొత్తపేట శ్రీ శ్రీ రాజరాజేశ్వర నాగాలయంలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, తాజా మాజీ జడ్పీ చైర్మన్ వసంత, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బోగ శ్రావణి స్వామి వారి ప్రతిమలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగాలయం మరియు శివలింగం శివాలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వేదమంత్రాల సాక్షిగా భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. పోలీసు, వైద్య, రెవెన్యూ గ్రామపంచాయతీ దేవాదాయ ధర్మాదాయ శాఖ ల సిబ్బంది మరియు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధతో మహాశివరాత్రి వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.

మార్చి1న జరిగే బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలి

పాలేరు, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే): నిర్మాణం రంగలో ఉన్న 56 రకాల వృత్తుల వారికీ సామజిక భద్రత, మౌళిక సదుపాయలు, సమగ్ర చట్టం కావాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటియూ)కూసుమంచి మండల అధ్యక్షులు పదిరి శ్రీను కోరారు. బుధవారం నియోజకవర్గంలోని నేలపట్ల గ్రామంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న ఎన్ డి ఏ ప్రభుత్వం 24 చట్టాలను 4 కొడులుగా మార్చివేసి కార్మికులపట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.మార్చి 1 వ తేదీన కూసుమంచిలో జరిగే మండల మహాసభలో కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులతో కలిసి ప్రచారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పడిశాల శేషయ్య, రాము, బాబు, పోశం నాగార్జున తదితరులు పాల్గొన్నారు...

మంత్రి పొంగులేటికి ధన్యవాదములు తెలిపిన అన్నదాతలు

మంత్రి పొంగులేటి చొరవతో తీరనున్న రైతుల కష్టాలు

పాలేరు, ఫిబ్రవరి 26 (వాయిస్ టుడే) రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో ఐదు గ్రామాలకు చెందిన సుమారు 400ఎకరాలకు సంబంధించిన రైతుల కష్టాలు తీరనున్నాయి. గత కొద్ది నెలల క్రితం వచ్చిన అతి భారీ వరదల కారణంగా నర్సింహులగూడెం ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ పూర్తిగా దెబ్బతినడంతో ఐదు గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో సంబంధిత రైతులు గత కొద్ది రోజుల క్రితం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా వెంటనే స్పందించిన ఆయన తక్షణమే ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇరిగేషన్ డీఈ రమేష్ రెడ్డికు ఆ బాధ్యతలను అప్పగించారు. నర్సింహులగూడెం ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ ను తక్షణమే మరమ్మతులు చేయాలని, వీలున్నంత త్వరగా నీటిని రైతులు సాగు చేసిన పంటలకు అందించాలని సూచించారు. దీంతో రంగంలోకి దిగిన ఇరిగేషన్ అధికారులు ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ ను మరమ్మతులు చేయించారు. వారంరోజుల్లో పనులు పూర్తి చేశారు..కాగా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం సంబంధిత ఇరిగేషన్ అధికారులు డీఈ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎత్తిపోతల పథకం నుంచి ఐదు గ్రామాలకు సాగు నీటీనీ విడుదల చేశారు. దీంతో మండలంలోని కూసుమంచి, తుర్కగూడెం, కిష్టాపురం, చేగొమ్మ, చింతలతండా గ్రామాలకు చెందిన సుమారు 400 ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం లభించింది.

శంభు లింగేశ్వర దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా ఫిబ్రవరి-26వాయిస్ టుడే : సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి పూసాలలో శంభు లింగేశ్వర స్వామి దేవాలయం లో మహా శివరాత్రి వేడుకలను, దేవాలయ కమిటీ చైర్మన్ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ పరమశివుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రజలు కష్టాలు తొలగి రైతులు అభివృద్ధి బాటలో నడవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ వేగోళం శంకర్ గౌడ్, పధ్నాలుగవ వార్డు మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్ శంభు లింగేశ్వర స్వామి ఆలయ కమిటీ డైరెక్టర్ లు కనుకుంట్ల ప్రమీల శ్రీనివాస్, పెగడ శ్యామ్, పిట్టల రమేష్, జూలూరి శ్రీనివాస్, పురం దిలీప్ కుమార్, పురం హరికిషన్, బుర్ర సురేష్ గౌడ్, మేకల రాజయ్య, వేగోళం అనిల్ గౌడ్, గడ్డం అంజి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ ప్రెసిడెంట్ ఉస్తేం రవి, మాజీ ఎంపీటీసీ కంకణాల ఆశాలు పాల్గొన్నారు.